ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 25.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 305 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

అండర్-19 సూపర్ సిక్స్‌లో భారత్ 12

ఒకాయన వార్త రాశారు...
మరొకాయన లేఖ రాశారు..
మరోకరు అక్కడి నుంచి
విచారణ చేస్తామన్నారు.. ఏందీ
మీ ముగ్గురి వ్యవహారం?
సింగరేణిపై కొన్ని రోజులుగా
కొన్ని కట్టుకథలు, రాతలు
వచ్చాయి. పెట్టుబడులు,
కట్టుకథలు, పిట్టకథల విష
పలుకులతో తప్పుడు ప్రచారానికి
రాధాకృష్ణ తెరలేపారు.
- డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

సింగరేణిపై విష పలుకులు

తప్పుడు ప్రచారానికి తెరలేపారు

- రాష్ట్ర ప్రభుత్వంపై కావాలని తప్పుడు కథనాలు
- ఎవరి కళ్లలో ఆనందం చూడాలని రాశారో?
- రాతల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో?
- హరీశ్ రావు లేఖ రాయడం మంచిదే
- కిషన్ రెడ్డి విచారణ చేస్తామనడం కూడా మంచిదే
- నిజానిజాలు బయటకు రావాలి... ప్రజలకు తెలియాలి
- టెండర్ డాక్యుమెంట్లు వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లేదు
- తన వ్యక్తిత్వాన్ని ఒక్క రోజులో రాస్తానంటే ఊరుకోను
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపాటు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తీవ్రంగా ఖండించారు. శనివారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్లో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి భట్టి మీడియాతో మాట్లాడుతూ..సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఒకాయన రాశారు...మరొకాయన లేఖ రాశారు..మరోకరు అక్కడి నుంచి ఏందీ మీ ముగ్గురి వ్యవహారం అని భట్టి నిలదీశారు. సింగరేణిపై కొన్ని రోజులుగా కొన్ని కట్టుకథలు, రాతలు వచ్చాయని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క తెలిపారు. పెట్టుబడులు, కట్టుకథలు, పిట్టకథల విష పలుకులతో తప్పుడు ప్రచారానికి రాధాకృష్ణ తెరలేపారని అన్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో

...:: మిగతా 2లో

అందరి బాగోతాలను బయటపెడతాం

ధరణిని ఆసరాగా చేసుకొని భూములు కొల్లగొట్టారు

చలానా సొమ్మును కాజేశారు.. వారిని వదిలిపెట్టం

- ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాల గుర్తింపు
- త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్
- ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు
- 9 జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు
- ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 24 :- ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టినవారిని, రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో

...:: మిగతా 2లో

భారత్‌పై టారిఫ్‌లు తగ్గింపు..?

భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ప్రస్తుతం అమలు చేస్తున్న 25 శాతం టారిఫ్‌లను త్వరలోనే వెనక్కి తీసుకునే అవకాశం ఉందని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.

11

ఉగ్ర కుట్ర భగ్నం..

మరో రెండు రోజుల్లో రిపబ్లిక్ డే ఉందనగా ఇంటెలిజెన్స్ అధికారులు ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. జనవరి 26న దేశంలో రిపబ్లిక్ డే ఉత్సవాలను నిర్వహించుకోవడానికి సిద్ధమవుతుండగా ఉగ్రదాడుల కుట్ర బయటపడింది.

11

స్టార్టప్‌ల కేంద్రంగానే టీ హబ్

- ప్రభుత్వ కార్యాలయాలకు ఇవ్వడం లేదు
- వాటిని వేరే ప్రభుత్వ భవనాల్లోకి తరలిస్తాం
- టీ హబ్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగానే ఉంచాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 24 :- తెలంగాణలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన టీ హబ్‌ను ప్రభుత్వ కార్యాలయాలకు ఇవ్వడం లేదని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికాలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్‌తో మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగానే ఉంచాలని సూచించారు. అక్కడికి ప్రభుత్వ కార్యకలాపాలను తరలించొద్దని సూచించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీస్‌లను వేరే ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని చెప్పారు. హైదరాబాద్‌లో చాలా ప్రభుత్వ ఆఫీస్‌లు ఇంకా అద్దె భవనాల్లో ఉంటున్నాయి. అయితే వాటికి నెల నెల కోట్ల రూపాయల అద్దెలు చెల్లించడం ప్రభుత్వానికి భారంగా మారుతోంది. అందుకే వాటిని ప్రభుత్వ భవనాలకు తరలించాలని ఆలోచించారు. అయితే ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన టీ హబ్‌లోకి తరలిస్తున్నారనే వార్త

...:: మిగతా 2లో

కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి

సింగరేణిని దోచుకుంటున్నాయి

- రెండు పార్టీల దోపిడీపై విచారణ జరపాలి
- సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి
- అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరు?
- కేటీఆర్, కేసీఆర్లకు కాంగ్రెస్ క్లీన్ చిట్ ఇస్తోందా?
- సిట్‌కు స్వేచ్ఛ ఇవ్వాలి
- రోహింగ్యాలకు రేషన్, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్సే
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని, గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. శనివారం అయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని, కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి భట్టి చెబుతున్నారని అన్నారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలన్నారు. 2014 నుండి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన అన్నారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే... గుజరాత్ ను ఎందుకు లాగుతున్నారు? అని ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే... ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని అన్నారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని, సింగరేణిలో దోచుకున్న సొమ్ముతోనే బీఆర్ఎస్ పార్టీని ఇన్నాళ్లు నడిపించారని అన్నారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు.. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది' అని

...:: మిగతా 2లో



కశ్మీర్‌లో జైషే టాప్ కమాండర్ హతం

ఉగ్రవ్యతిరేక ఆపరేషన్లలో భద్రతా బలగాలు కీలక విజయం సాధించాయి. కశ్మీర్‌లోని కథువా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో జైషే మహమ్మద్‌కు చెందిన కరుడుగట్టిన ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి.

11



నాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

ఫర్నిచర్ షాపులో చెలరేగిన మంటలు

- మంటల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు
- మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించిన రెస్క్యూ బృందాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దిగ్భ్రాంతి
- సంఘటనపై పూర్తిస్థాయి నివేదికకు ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: హైదరాబాద్ నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ షాపు ఉన్న భవనంలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షోరూమ్ గోడౌన్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తానికి వ్యాపించాయి. వాటిని అదుపు చేయడానికి రెస్క్యూ బృందాలు చాలా శ్రమించాల్సి వచ్చింది. నాంపల్లిలోని బచ్చా క్రిస్టల్ ఫర్నిచర్ దుకాణంలో

...:: మిగతా 2లో

నైనీ టెండర్ రద్దయిందంటే స్కాం జరిగినట్టేనా?

- సోలార్ స్కాంపై భట్టి మౌనం ఎందుకు?
- భట్టి విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు
- రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ వ్యవహారం
- మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: సింగరేణి బొగ్గు, సోలార్ టెండర్ల వ్యవహారంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించిన ప్రెస్‌మీట్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేశారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, భట్టి విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని హరీష్ రావు విమర్శించారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే అవినీతి జరిగినట్లు స్పష్టమైన నిదర్శనమని పేర్కొంటూ, అదే విధంగా పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా, బీటింగ్ అరౌండ్ ద బుష్‌లా మాట్లాడి మసిబూసి మారేడు కాయ చేశారు. కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది అనేది వాస్తవం. అందులో సీఎం రేవంత్ రెడ్డి బావమరిది పాత్ర కూడా ఉంది" అని హరీష్‌రావు ఆరోపించారు. తాను ఇటీవల బయటపెట్టిన సోలార్ పవర్ స్కాంపై నేటి ప్రెస్‌మీట్‌లో భట్టి విక్రమార్క ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. నైనీ టెండర్‌ను రద్దు చేసినట్లే మిగిలిన అన్ని టెండర్లను ఎందుకు రద్దు

...:: మిగతా 2లో

గవర్నర్ తీరుపై స్టాలిన్ ఫైర్

అసెంబ్లీ సమావేశాల ప్రారంభ సందర్భంగా తన ఉపన్యాసాన్ని చదవకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి తన హోదాను అవమానించారని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం విమర్శించారు.

11

రాజకీయం

స్టార్టప్‌ల కేంద్రంగానే టీ హబ్

మొదటిపేజీ తరువాయి

ప్రచారంలోకి వచ్చింది. వెంటనే ప్రతిపక్షాలు స్వరం పెంచాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ ఈ నిర్ణయం సరికాదని మండిపడింది. నాడు స్టార్టప్‌లకు ప్రాణం పోసేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తే ఇప్పుడు వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చంపేస్తోందని విమర్శించింది. ఇది ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమని ఆరోపణలు చేసింది. గంటల వ్యవధిలోనే సోషల్ మీడియాలో దీనిపై చర్చ మొదలైపోయింది. జరుగుతున్న ప్రచారాన్ని జరగబోయే ప్రమాదాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. సీఎస్ రామకృష్ణారావుకు ఫోన్ చేసి అలాంటి ఆలోచనలు చేయొద్దని సూచించారు. దానికి బదులు వేరే ప్రభుత్వ బిల్డింగ్స్‌లో ఉన్న స్పేస్‌ను వాడుకోవాలని అన్నారు. టీ హబ్ కేవలం స్టార్టప్‌లకు కేంద్రంగా ఉంటుందని స్పష్టం చేశారు.

నైనీ టెండర్ రద్దయిందంటే స్కాం జరిగినట్టేనా?

మొదటిపేజీ తరువాయి

చేయడం లేదని నిలదీశారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బీఆర్ఎస్‌పై నెట్టే ప్రయత్నం చేసినంత మాత్రాన నిజాలు అబద్ధాలుగా మారవని, జరిగిన స్కాంలు స్కీంలుగా మారిపోవని హరీష్ రావు వ్యాఖ్యానించారు. 2018లోనే ఈ నిబంధన అమలులో ఉందని చెబుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణగా చూపించడం ద్వారా ఏం చెప్పదలుచుకున్నారని ప్రశ్నించారు. "సైట్ విజిట్ నిబంధన తప్పు కాకపోతే నైనీ టెండర్ ఎందుకు రద్దు చేశారు? అదే విధానం సింగరేణిలో కూడా అమలయ్యిందని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు. సైట్ విజిట్ అమలైంది, నైనీ రద్దయింది అంటే.. స్కాం జరిగినట్టే కదా?'' అని ఆయన అన్నారు. భట్టి విక్రమార్కపై తనకు గౌరవం ఉందని పేర్కొన్న హరీష్ రావు, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ ద్వారానే జరగాలని భావించి లేఖ రాశానని తెలిపారు. నిజంగా రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది పాత్రపై నిష్పక్షపాత విచారణ జరిపిస్తానని భట్టి హామీ ఇస్తే, ఆయనకూ లేఖ రాయడానికి సిద్ధమని స్పష్టం చేశారు

అందరి బాగోతాలను బయటపెడతాం

మొదటిపేజీ తరువాయి

ఎదురైన అంశాలు, ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటినుంచి 35 వేల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందని అయితే విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయిలు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ఎలాంటి ముందుచూపు లేకుండా ఒక కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డీజీ విజయ్‌కుమార్, ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డిఐజీ ఎం. సుభాషిని, సీఎమ్ఆర్వో మకరంద్, ఏసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డీఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసీ ప్రతినిధి శ్రీనివాస్, హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజామోదంతో జిల్లాలను పునర్ వ్యవస్థీకరిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ మాట్లాడుతున్న భాష సరిగా లేదని, మతి లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు వ్యక్తిగతంగా తాను రిఫరెండంగా భావిస్తున్నానని అన్నారు. ఇప్పటికే రెండు సార్లు కేటీఆర్ రిఫరెండం అన్నారు. మళ్లీ ఇప్పుడు రిఫరెండం అంటున్నారు. ఇంతకు ముందు జరిగిందే ఈ ఎన్నికల్లో జరుగుతుంది. ఆనాడు సోయి లేకుండా ఇష్టం వచ్చినట్లు జిల్లాలను ఏర్పాటు చేసి ఇప్పుడు అగ్నిగుండం చేస్తామని మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో ప్రజామోదంతో జిల్లాలను పునర్ వ్యవస్థీకరిస్తామన్నారు. 'బట్టకాల్చి మీద వేయడమే ప్రతిపక్ష పార్టీ పని అన్నట్లుగా ప్రధాన ప్రతిపక్షం వ్యవహరిస్తోంది. మా రెండేళ్ల పాలనలో ఏ తప్పు జరిగిందని మాట్లాడుతున్నారు. వారి పాలనలో అక్రమాలు జరిగినట్లుగానే ఇప్పుడు కూడా అలాగే జరుగుతున్నాయని భ్రమపడుతున్నారు. ఇంకా అధికారంలో ఉన్నట్లుగా వారి వ్యవహార శైలిఉంది. అధికారంలోకి వస్తామని పగటికలలు కంటున్నారు' అని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని ప్రజా ప్రతినిధులకు వివరించండి

- పథకం మార్గదర్శకాలపై ప్రజలకు అవగాహన కల్పించండి
- నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించండి
- అవినీతిని ఏమాత్రం ఉపేక్షించవద్దు
- డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయండి
- హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతం ఆదేశం

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులు మరింత విస్తృతంగా జరిగేలా చూడాలని, ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు పనులను ప్రారంభించేలా అన్ని రకాలుగా ప్రయత్నించాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్వి. పి. గౌతం అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో పథకం పురోగతిని స్థానిక ఎమ్మెల్యేలకు వివరించాలని, ఇండ్లను పూర్తి చేయడంలో ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలను తీసుకోవాలని ఉద్బోధించారు. హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శనివారం నాడు జిల్లా ప్రాజెక్టు డైరక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఇండ్ల నిర్మాణాల పురోగతిని బట్టి చూస్తే మార్చి కల్లా లక్ష ఇండ్లను పూర్తి చేయగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, ఇదే స్ఫూర్తితో మంజూరైన అన్ని ఇండ్లను పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా పథకం అమలునకు నిర్దేశించిన మార్గదర్శకాలు, ప్రభుత్వ ఆదేశాలు తదతర అంశాలపై అధికారులందరూ సమగ్రమైన పరిజ్ఞానం కలిగి ఉండాలని, అలాగే వాటి గురించి ప్రజలను కూడా చైతన్యపరిచాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో దాదాపు అన్ని కీలకమైన అంశాలపై కలెక్టర్లకే నిర్ణయాధికారాలు ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. ఆన్ లైన్ లో ప్రతి ఇంటి నిర్మాణానికి సంబంధించిన సమాచారం అధికారులకు అందుబాటులో ఉన్నదనీ, నిర్మాణపు పనులు ఏమాత్రం మందగించినా అధికారులు వెంటనే దృష్టి సారించాలని మేనేజింగ్ డైరక్టర గౌతం పిడిలను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల తోనే సరైన ప్రణాళికతో లబ్దిదారులు ఇండ్లను నిర్మించేలా ఇంజనీరింగ్ విభాగం ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దీనిని అతి ముఖ్యమైన అంశంగా పిడిలు, డిఇలు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించాలని, ఎక్కడ అవినీతి ఆరోపణలు వచ్చినా ఉపేక్షించవద్దని, వాటిపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పురోగతి తోపాటు జిల్లాల వారీగా పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలన్నిటినీ పూర్తి చేయాలని, వీటి అలాట్‌మెంట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎండి ఆదేశించారు.ఈ కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి అన్ని నిర్మాణాలను సెప్టెంబరు నాటికల్లా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్. ఈశ్వరయ్య, చీఫ్ ఇంజనీర్ ఎం. చైతన్యకుమార్, విజిలెన్స్ ఆఫీసర్ పి. బలరాం, జనరల్ మేనేజర్లు =బి. మమత,= ఎం. శ్రీదేవి, సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

“

ఉమ్మడి ఏపీలో కన్నా ప్రస్తుత బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలోనే సింగరేణి ఎక్కువ దోపిడీకి గురైంది. అక్రమాలకు సంబంధించి రికార్డులు తారుమారయ్యే ప్రమాదం ఉంది. వాటిని సీజ్ చేయాలి. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు అంటుంటే, విచారణకు పిలిచామని సజ్జనార్ చెబుతున్నారు. ఏది నిజం? కేటీఆర్, కేసీఆర్లకు ప్రభుత్వం క్లీన్ చిట్ ఇస్తోందా?.
- కేంద్ర మంత్రి బండి సంజయ్

సింగరేణిపై విష పలుకులు

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ.. రకరకాలుగా అపోహలు ప్రచారం చేశారని, రాష్ట్ర ప్రభుత్వంపై కావాలని తప్పుడు కథనాలు రాస్తున్నారని విమర్శించారు. ఏ రాబంధులు, ఏ గద్దలు, ఏ దోపిడీ దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలు వస్తున్నట్టు కనిపిస్తోందని తెలియజేశారు. ఏ నినాదం వెనక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో? అని..తొలిపలుకుల రాతల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో? అని సందేహం వ్యక్తం చేశారు.అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతున్నారని, సింగరేణి కథనంపై రెండు అంశాలు లేవనెత్తారని మండిపడ్డారు. అందరికీ వాస్తవాలు తెలియజేసేందుకు డాక్యుమెంట్లు కూడా ఇస్తామని అన్నారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాయడం మంచిదేనని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విచారణ చేస్తామనడం కూడా మంచిదేనని భట్టి పేర్కొన్నారు. అందరి నిర్ణయాలను తాము స్వాగతిస్తున్నామని, 2018 లోనే టెండర్ డాక్యుమెంట్ కోల్ ఇండియా తయారు చేసి పంపించిందని అన్నారు. సైట్ విజిట్ తప్పనిసరి అని కోల్ ఇండియానే పెట్టిందని, నిజానిజాలు బయటకు రావాలని.. వాస్తవాలు ప్రజలకు తెలియాలని చెప్పారు. పత్రికలు, నాయకులే కాదు.. సోషల్ మీడియాలో కూడా ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, టెండర్ డాక్యుమెంట్లు వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లేదని అన్నారు. గత డాక్యుమెంట్ల ఆధారంగానే సింగరేణి టెండర్లు పిలిచిందని, అడ్డగోలు ప్రచారం చేసేవారి అసలు రూపం బయటపడాలని అన్నారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ తప్పనిసరి అని ఎన్ఎమ్ డిసి కూడా చెప్పిందని, రైల్వే శాఖలో కూడా టెండర్ వేసే కంపెనీ సైట్ విజిట్ తప్పనిసరి అని నిబంధన ఉందని తెలిపారు. హిందూస్థాన్ కాపర్స్ సంస్థలో కూడా సైట్ విజిట్ రూల్ ఉందని, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీస్ లిమిటెడ్ లోనూ సైట్ విజిట్ నిబంధన ఉందని అన్నారు. గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లలోనూ ఆ రూల్ ఉందని, సెంట్రల్ మైనింగ్, డిజైనింగ్ అండ్ ప్లానింగ్ అనే సంస్థ సైట్ విజిట్ అనే నిబంధన పెట్టిందని అన్నారు. 'రాధాకృష్ణ ఎవరి ప్రయోజనాల కోసం.. ఎవరి కళ్లలో ఆనందం చూడాలని రాశారో? అని ప్రశ్నించారు. రాధాకృష్ణ తన ఆనందం తాను వెతుక్కున్నార'ని చురకలంటించారు. దేశంలోని చాలా కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలు సైట్ విజిట్ అనే నింబంధన పెట్టాయని, సైనిక్ స్కూల్, దీన్ దయాళ్ పోర్టు టెండర్ లో కూడా ఇలాంటి నిబంధనలే ఉన్నాయని అన్నారు. అసలు.. సృజన్ రెడ్డి ఎవరు? అని సైట్ విజిట్ పెడితే.. సృజన్ రెడ్డికి ఎలా ఇస్తారు? అని ప్రశ్నించారు. సోదా కంపెనీ ఎండి దీప్తి రెడ్డి.. ఆమె కందాల ఉపేందర్ రెడ్డి కూతురు అని.. కందాల ఉపేందర్ రెడ్డి అల్లుడే సృజన్ రెడ్డి అన్నారు. ఆర్జీఒసి 2 సి 5 కంపెనీకి ఇచ్చారని, బీఆర్ఎస్ హయాంలో హర్ష కంపెనీ ఎవరిదో అందరికీ తెలుసు అని అన్నారు. కందాల ఉపేందర్ రెడ్డి కాంగ్రెస్ లో గెలిచినా.. బీఆర్ఎస్ తీసుకుని పోయిందని ఎద్దేవా చేవారు. 'తాను ఆస్తులు సంపాదించుకోవడానికి రాలేదని, రాధాకృష్ణ మీరు తప్పుడు రాతలు రాశారని అన్నారు. తన వ్యక్తిత్వాన్ని ఒక్క రోజులో ఒక్క కలంతో రాస్తానంటే ఊరుకోమని' భట్టి విక్రమార్క హెచ్చరించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి

సింగరేణిని దోచుకుంటున్నాయి

మొదటిపేజీ తరువాయి

అన్నారు. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారని అన్నారు. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా భాగోతం మీరు బయటపెడితే... మీ భాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. మరో వారం రోజుల తరువాత సింగరేణి భాగోతాన్ని దారి మళ్లించేందుకు మరో అంశాన్ని తెరపైకి తెస్తారు.' అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు.

అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరు ?

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతున్నారని, విచారణకు పిలిచామని సజ్జనార్ చెబుతున్నారని,. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్, కేసీఆర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం క్లీన్ చిట్ ఇస్తోందా? కేటీఆర్, హరీష్ సహా అందరినీ సాక్షిగా పిలిస్తే, అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరు ? ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటి? అని కేంద్ర మంత్రి సంజయ్ ప్రశ్నించారు. సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లేనని, ఇప్పటికైనా సిట్ కు స్వేచ్ఛ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుందని, ప్రజలను దోచుకున్న కేసులన్నీ కేసీఆర్ కుటుంబానికి లొట్టపీసు కేసుల్లాగే కన్పిస్తాయన్నారు. ఎన్ని అరాచకాలు, అవినీతి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదనే ధీమా కేసీఆర్ కుటుంబంలో ఉందని, ఫోన్ ట్యాపింగ్ కేసులో నన్ను విచారణకు పిలిచి నా ఫోన్ ట్యాప్ అయ్యిందని, మావోయిస్టు జాబితాలో నా పేరును చేర్చారని చెప్పారు. మరి అందుకు కారకులైన వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? కాంగ్రెస్ స్కాంలు బయటపడుతున్నప్పుడల్లా ఫోన్ ట్యాపింగ్ కేసుతో డ్రామాలాడుతున్నారని అన్నారు. 'కేటీఆర్ ఏం చేయనట్లుమాట్లాడుతున్నారు. ఎన్ని కుటుంబాలను, ఎంత మంది జీవితాలను నాశనం చేశారో తెలియదా? నిజాం అరాచకాలను మరువలేదు... నీ అరాచకాలను కూడా మర్చిపోలేం. కేటీఆర్ లో ఇంకా అహంకారం తగ్గలేదు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ నా చాలెంజ్ కు సిద్ధమా? దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా? మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా? ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా? ఇంకా సిగ్గులేకుండా దేశ భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతారా? నేను సవాల్ విసిరితే లీగల్ నోటీసులంటూ డ్రామాలాడతారు. పోనీ ఆ లీగల్ నోటీసులకైనా కట్టుబడి ముందుకు సాగుతారా? అంటే... మధ్యలోనే పారిపోతారు.' అని మండి పడ్డారు.

రోహింగ్యాలకు రేషన్, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ లే

2014కు ముందే రోహింగ్యాలు పాతబస్తీలోకి అక్రమంగా ప్రవేశించారు. రోహింగ్యాలు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులేనని సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో నాటి హోంమంత్రి రోహింగ్యాలకు ఇండ్లు మంజూరు చేసి రోహింగ్యాలకు మద్దతిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పాలకులే ఓటు బ్యాంకు కోసం రోహింగ్యాలకు వంతపాడుతుంటే... శాంతిభద్రతలను కాపాడేదెవరు? సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని, సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలన్నారు. లేనిపక్షంలో ఆ రికార్డులన్నీ తారుమారు చేసే ప్రమాదముందని, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని అన్నారు.

నాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మంటలు చెలరేగాయి. నాలుగంతస్తులున్న ఈ భవనంలోని అన్ని ఫ్లోర్లకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు, హైడ్రా, విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది 10 ఫైర్ ఇంజిన్ వాహనాలు, స్కైలిఫ్ట్ క్రేన్ సహాయంతో మంటలు ఆర్పేశారు. అయితే పొగ దట్టంగా కమ్ముకోవడంతో సహాయక చర్యలు వేగంగా సాగడం లేదు. చివరకు ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని కూడా రంగంలోకి దింపారు. అధికారులు భవనం లోపల చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు రోబోను రంగంలోకి దింపారు. రోబో భవనం లోపలకి వెళ్లి చిక్కుకుపోయిన వారు ఎక్కడ ఉన్నారో గుర్తుస్తుందని తెలిపారు. మరోవైపు హైదరాబాద్ సీపీ సజ్జనార్, అగ్నిమాపక డీజీ విక్రమ్ సింగ్ మాన్ ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు మొదలయ్యాయని ప్రమాద సమయంలో బయటపడ్డ సిబ్బంది చెబుతున్నారు. జీ ప్లస్ ఫోర్ భవనంలో ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు మంటల్లో చిక్కుకున్నారు. వీరి పరిస్థితి ఏంటనేది ఇప్పటివరకు తెలియలేదు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. భవనం చుట్టూ సెట్‌బ్యాక్స్ (ఖాళీ స్థలం) లేకపోవడంతో ఫైరింజన్లు లోపలికి వెళ్లడానికి చాలా ఇబ్బంది జరిగింది. దీంతో సిబ్బంది పక్కనే ఉన్న భవనాల గోడలపైకి ఎక్కి ప్రాణాలకు తెగించి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. కాంప్లెక్స్ అద్దాలను పగులగొట్టి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. సుమారు పదిగంటల పాటు రెస్క్యూ బృందాల ఆపరేషన్‌తో మంటలు అదుపులోకి వచ్చాయి. భవనంలో ఆరుగురు చిక్కుకుపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దుకాణంలో మొత్తం మూడు కుటుంబాలు పని చేస్తున్నాయి. వారిలో వాచ్ మెన్ ఇద్దరు పిల్లలు, మరో కుటుంబంలోని నలుగురు పెద్దవారు చిక్కుకున్నట్లు సమాచారం. పిల్లల తల్లిదండ్రులు లక్ష్మి, యాదయ్య పని కోసం బయటికి వెళ్లారు. సెల్లర్‌లో వారి పిల్లలు ప్రణీత 6వ తరగతి, అఖిల్ 2వ తరగతి చిక్కుకున్నారు. పెద్దవారిలో ఫర్నిచర్ సప్లై చేసే వాహన డ్రైవర్ సయ్యద్ హబీబ్ (40), బిల్డింగ్‌లో పదేళ్లుగా పని చేస్తున్న మహమ్మద్ ఇంతియాజ్ (27) ఉన్నాడు. భవనంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అగ్నిమాపక సిబ్బంది రోబో సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. వారిని రక్షించేందుకు భవనంలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో, మరో భవనం నుంచి ప్రవేశించినట్లు సమాచారం. ఫర్నిచర్ దుకాణంలో ఇద్దరు చిన్నారులు సహా మరో ముగ్గురు ఉన్నట్లు దుకాణం వాచ్‌మెన్ లాల్ కాన్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో దుకాణం సెల్లార్‌లో తన తల్లిదండ్రులు బేబీ ఉస్మాన్ ఖాన్ ఉన్నట్లు తెలిపారు.

మంత్రి పొంగులేటి దిగ్భ్రాంతి

సంఘటనపై పూర్తిస్థాయి నివేదికకు ఆదేశం

నాంపల్లి స్టేషన్ రోడ్ ఫర్నిచర్ మాల్‌లో శనివారం జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ తో ఫోన్‌లో మాట్లాడిఅగ్ని ప్రమాదానికి గల కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంటలు వ్యాపించకుండా పక్క భవనాలు ఖాళీ చేయాలని ఆదేశించారు. పోలీస్, ఫైర్ అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు వేగవంతం చేయాలన్న మంత్రి పొంగులేటి అదనపు ఫైర్ ఇంజిన్స్‌తో మంటలు అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ తో మాట్లాడి ఘటనా స్థలానికి వెళ్లాలని ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బాధితులను వెంటనే ఆదుకోవాలని అధికారులకు సూచించారు.

ఎగ్జిబిషన్‌కి సందర్శకులు రావొద్దు: హైదరాబాద్ కలెక్టర్

ప్రమాదం జరిగిన స్థలంలో హైదరాబాద్ కలెక్టర్ హరిచందన సహాయక చర్యలను పర్యవేక్షించారు. అగ్ని ప్రమాదం వల్ల ఇప్పటికే ఈ మార్గంలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. ఈ మార్గంలో వాహనాలను వేరే రూట్లకు మళ్లించామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న రద్దీ నేపథ్యంలో ఆదివారం ఎగ్జిబిషన్‌కి సందర్శకులు రావొద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ మార్గంలో రెస్క్యూ టీమ్స్ బృందాలు, అంబులెన్స్, అగ్నిమాపకశాఖ వాహనాలు, వైద్య సిబ్బంది వాహనాలను మాత్రమే అనుమతించాలని పోలీసు అధికారులకు కలెక్టర్ సూచించారు. అగ్నిప్రమాదానికి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాకే ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

మేడారం జాతరకు ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

- 4000 ఆర్టీసీ బస్సులు, మహిళలకు ఉచిత ప్రయాణం
- ఈసారి ప్రత్యేకంగా చిల్డ్రన్ ట్రాకింగ్ మానిటరింగ్ సిస్టమ్
- 11 ప్రధాన బస్ స్టాండ్లలో పిల్లల చేతికి ట్రాకింగ్ ట్యాగ్
- తప్పిపోయిన పిల్లలను వెంటనే గుర్తించే అవకాశం
- రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- క్యూ లైన్ కాంప్లెక్సులు, బస్టాండ్ ప్రారంభించిన మంత్రి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడారం, జనవరి 24: మేడారం జాతరకు ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం అని రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సమ్మక్కసారలమ్మల మహాజాతర పురస్కరించుకుని భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో మేడారంలో ఏర్పాటు చేసిన క్యూ లైన్ కాంప్లెక్సులు, బస్టాండ్ను శనివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. శనివారం ఉదయం మేడారం చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఆలయ పూజారులు ఆదివాసి సాంప్రదాయాలతో డోలు వాయిద్యాలతో ఆహ్వానం పలికారు. వనదేవతలను దర్శించుకున్న మంత్రి పొన్నం తమ ఎత్తు బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మేడారం జాతరకు భారీ రవాణా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 4000 ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించామని, మహిళలకు ఉచిత ప్రయాణం తప్పనిసరిగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అనంతరం మేడారంలో క్యూ లైన్ కాంప్లెక్స్, బస్టాండ్ ప్రారంభించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణ, హైదరాబాద్ పాటు రాష్ట్రవ్యాప్తంగా 51 కేంద్రాల నుంచి దాదాపు 4000 ఆర్టీసీ బస్సులను మేడారం జాతర కోసం ప్రణాళికాబద్ధంగా నడుపుతున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీ పెరిగితే మరిన్ని బస్సులు కూడా అందుబాటులో ఉంచేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు గుర్తు చేసిన మంత్రి, జాతర సందర్భంగా కూడా రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరికీ ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. భక్తులు సొంత వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల ద్వారానే మేడారానికి రావాలని కోరారు. సొంత వాహనాలతో వస్తే దూరంగా పార్కింగ్ చేయాల్సి రావడంతో పాటు నడకలో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. అందుకే ప్రజలు ప్రభుత్వ బస్సులనే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. జాతరలో 91 బస్ కేంద్రాల్లో క్యూ లైన్లు, షెల్టర్లు, తాగునీరు, వాష్రూములు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా బస్సులు మధ్యలో నిలిచిపోతే వెంటనే పరిష్కరించేందుకు క్రేన్లు, మొబైల్ టీమ్స్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ట్రాఫిక్ జామ్ కాకుండా జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈసారి ప్రత్యేకంగా చిల్డ్రన్ ట్రాకింగ్ మానిటరింగ్ సిస్టమ్ అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. 11 ప్రధాన బస్ స్టాండ్లలో పిల్లల పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసి చేతికి ట్రాకింగ్ ట్యాగ్ కట్టే విధానం ద్వారా తప్పిపోయిన పిల్లలను వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి సీతక్క సారథ్యంలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా మేడారం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఫారెస్ట్, ఎకో టూరిజం దృష్ట్యా భక్తుల సంఖ్య ఏటా పెరుగుతున్న నేపథ్యంలో శాశ్వత బస్ స్టాండ్, శాశ్వత క్యూలైన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి సంవత్సరం తాత్కాలిక ఏర్పాట్లకు ఖర్చయ్యే కోట్ల రూపాయలను తగ్గించేందుకే శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే మహా జాతరలో భక్తులను క్షేమంగా తీసుకురావడం, తిరిగి స్వస్థలాలకు చేర్చడం రవాణా శాఖ ప్రధాన బాధ్యతగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కేటీఆర్, హరీశ్ రావు కీలక భేటీ
- ట్యాపింగ్ కేసు, ఎన్నికల వ్యూహాలపై చర్చ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: మున్సిపల్ ఎన్నికలకు పార్టీ నేతలు సన్నద్ధం కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఎర్రవల్లి ఫామ్హౌస్లో ఆయన కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికలకు కావలసిన వ్యూహాలపై చర్చించారు. భేటీలో కేటీఆర్, హరీశ్ రావును ప్రతిపక్షాలను ఎదుర్కోవడానికి పార్టీ కార్యకర్తలు, నాయకత్వం సిద్ధంగా ఉన్నారా? అని కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆయన స్పష్టంగా మున్సిపల్ ఎన్నికలకు పార్టీ సన్నద్ధం కావాలి అని సూచించారు. అలాగే, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే ఎక్కువ స్థానాల్లో గెలవడం కేసీఆర్ ముఖ్య లక్ష్యంగా ఉంచారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయానికి కావలసిన వ్యూహాలను సమీక్షించారు.

నేడు జేపీ దర్గాకు మంత్రి అజహారుద్దీన్

ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 24: ఆదివారం హజరత్ జహంగీర్ పీర్ దర్గా క్షేత్రానికి ప్రభుత్వ సంస్థలు, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అజహారుద్దీన్ రానున్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు దర్గాలో పటాన్ చెరువు కాంగ్రెస్ పార్టీ నేత రామ్మోహన్ రెడ్డి న్యాజ్ సందర్భంగా మహమ్మద్ అజారుద్దీన్ దర్గా షరీఫ్ కు వస్తున్నట్లు తెలిపారు. మంత్రి అజారుద్దీన్ మొదటిసారిగా నియోజకవర్గానికి రాబోతున్నారని ముఖ్య నాయకులు హాజరుకావాలని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలకు ఇన్చార్జీల నియామకం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం భారత రాష్ట్ర సమితి కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా ప్రత్యేక సమన్వయకర్తలను నియమించారు. ఈ మేరకు పార్టీ తరపున నియమించబడిన మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్తల పూర్తి జాబితాను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం అధికారికంగా విడుదల చేశారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీకి ఒక సీనియర్ నాయకుడిని ఎన్నికల ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను ఏకం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం ఈ సమన్వయకర్తల ప్రధాన బాధ్యతగా ఉంటుంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ముగిసే వరకు వీరు నిరంతరం ఆయా మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉంటారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈ సమన్వయకర్తలు కీలక పాత్ర పోషిస్తారు. స్థానిక నాయకత్వంతో చర్చించి, గెలుపు గుర్రాలను గుర్తించి, నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్టానానికి సమర్పిస్తారు. అంతేకాకుండా, పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి అంశాలను వీరు పర్యవేక్షిస్తారు.

'ఉపాధి' కొత్త విధానంలో వేతన భద్రత లేదు

- ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్
- 'ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర'ను ప్రారంభించిన కాంగ్రెస్

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: ఉపాధి పథకం కొత్త విధానంలో వేతన భద్రత లేకపోవడంపై ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఆందోళన వ్యక్తం చేశారు. "మునుపు కుటుంబాలు కనీస వేతనాలపై ఆధారపడుతూ ఏడాది పొడవునా పని కోరగలిగేవి. ఇప్పుడు యాదృచ్ఛిక వేతన నిర్ణయాలు, పంటకాలంలో పనిలేకపోవడంతో గ్రామీణ కార్మికులు తక్కువ జీతాలున్న, అస్థిరమైన ఉద్యోగాల్లోకి నెట్టబడుతున్నారు" అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వము మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌రేగా)ను నిర్వీర్యం చేస్తోందన్న ఆరోపణలపై నిరసనగా, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) శనివారం మూడు రోజుల పాటు సాగే 'ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర'ను ప్రారంభించింది. ఈ యాత్ర చార్మినార్ నుంచి పురానాపుల్ వరకు సాగగా, అదే రోజున యాకుత్‌పురాలోని సింగరేణి కాలనీ నుంచి సంతోష్‌నగర్ ఎక్స్‌రోడ్స్ వరకు మరో దశలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు పాల్గొని, స్థానిక ఉద్యమానికి బలమైన మద్దతు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ ర్యాలీ నగరంలోని చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చంద్రాయణగుట్ట, మలక్‌పేట్ అనే ఐదు ప్రధాన అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా సాగి, జనవరి 26న ముగుస్తుంది. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హనుమంతరావు మాట్లాడుతూ, "మోదీ ప్రభుత్వం ఎంజీఎన్‌రేగా ఆత్మను నాశనం చేయాలని చూస్తోంది. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఉపాధిని డిమాండ్ చేసే చట్టబద్ధ హక్కును కేంద్రం నియంత్రించే ఉపకారంగా మార్చుతోంది. ఇది ప్రజాస్వామ్యంలో అంగీకరించలేం" అని అన్నారు. హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖలిద్ సైఫుల్లా గడ్డిపాత స్థాయి పాలనపై ప్రభావాన్ని హెచ్చరించారు. "గ్రామ పంచాయతీల ద్వారా వికేంద్రీకృతంగా అమలైనదే ఎంజీఎన్‌రేగా బలం. నేడు ఆ అధికారాలు తీసేసి కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. స్థానిక కార్మికులను హక్కులు, ప్రతినిధిత్వం లేని చౌక కూలీలుగా మార్చుతున్నారు" అని తెలిపారు. అతను ఇంకా మాట్లాడుతూ, "వేతన వ్యయాల్లో 40 శాతం భారం రాష్ట్ర ప్రభుత్వాలపై మోపడం అమలును నిరుత్సాహపరుస్తుంది. ఇది పేదలపై, ముఖ్యంగా ఎంజీఎన్‌రేగా మీద ఆధారపడే మహిళలు మరియు ఎస్సీ/ఎస్టీ కుటుంబాలపై నేరుగా చేసిన దాడి" అని అన్నారు. గ్రామీణ భారతానికి 'జీవనాధారం'గా ఎంజీఎన్‌రేగా ను పేర్కొన్న కాంగ్రెస్ నాయకులు, పథకం మద్దతుగా తీర్మానం కూడా చేశారు. గత రెండు దశాబ్దాల్లో ఈ పథకం ద్వారా 180 కోట్లకు పైగా మానవరోజుల ఉపాధి, దాదాపు 10 కోట్ల ప్రజా ఆస్తులు సృష్టించబడ్డాయని, స్థానిక ప్రణాళికల ద్వారా గ్రామ పంచాయతీలను శక్తివంతం చేసిందని వారు తెలిపారు. "కోవిడ్ 19 మహమ్మారి సమయంలో ఎంజీఎన్‌రేగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆధారస్తంభంగా నిలిచింది. ఇప్పుడు అది ముప్పులో ఉంది; మనం చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర హైదరాబాద్ దశలో పార్టీ కేడర్లు, కార్యకర్తలు, పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లకార్డులు, నినాదాలు, ప్రసంగాల ద్వారా ఎంజీఎన్‌రేగా అసలు నిర్మాణాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని హైలైట్ చేస్తూ, గ్రామీణ ఉపాధి కార్యక్రమాల కేంద్రీకరణ మరియు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హెచ్చరించారు. ఈ నిరసనలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, మాజీ పీసీసీ కార్యదర్శి భీమ్ అర్జున్ రెడ్డి, కె. రవిరాజ్, మామిడి కృష్ణ కుమార్, అల్లం భాస్కర్, మల్లికార్జున్, అబ్దుల్ ఖదీర్, యూసుఫ్ దానిష్, మహమ్మద్ అబ్దుల్ ఘనీ, మొహమ్మద్ ముస్తఫా, సయ్యద్ దిలావర్ హుస్సేన్, అరుణ్ ఠాకూర్, శంకర్ నాయక్, శ్రీనివాస్ వాల్మీకి, రంగ శ్రీకాంత్ గౌడ్, అలేవాలు, ఇందివేలు మరియు శేష యాదవ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

ప్రశ్నించినందుకే నోటీసులు

- బెదిరింపులకు భయపడబోను
- నోటీసులకు సమాధానం ఇస్తా
- సజ్జనార్‌పై కేసులు ఉన్నాయని అనలేదు
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణాధికారిగా ఉన్న సజ్జనార్‌పై తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పోలీసులు నోటీసులు జారీ చేయడంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలకు మద్దతుగా ప్రెస్ మీట్ పెట్టిన 12 గంటల వ్యవధిలోనే, అర్ధరాత్రి తన ఇంటికి వచ్చి పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తప్పుబట్టారు. కేటీఆర్, హరీష్ రావు వంటి నాయకులను విచారణ పేరిట వేధిస్తున్న తీరును ప్రశ్నించినందుకే ప్రభుత్వం తనపైకి పోలీసులను పంపిందని ఆయన ఆరోపించారు. బెదిరింపులకు తాను భయపడబోనని, తన వద్ద ఉన్న సమాచారంతోనే నోటీసులకు సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు. ప్రవీణ్ కుమార్ తన వివరణలో ప్రధానంగా నైతికత అంశాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఓటుకు నోటు కేసు సమయంలో తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం ఆంధ్రప్రదేశ్ నేతల ఫోన్లను ట్యాప్ చేసిందంటూ 2015లో ఏపీలో పలు కేసులు నమోదయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఆ సమయంలో సజ్జనార్ ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక అధికారిగా ఉన్నందున, ఇప్పుడు అదే ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఏర్పాటైన సిట్‌కు ఆయన నేతృత్వం వహించడం నైతికంగా సరికాదని తాను అభిప్రాయపడినట్లు తెలిపారు. నోటీసులో పేర్కొన్నట్లుగా తాను సజ్జనార్‌పై కేసులు ఉన్నాయని అనలేదని, గతంలోని కేసుల కారణంగా ఆయన విచారణాధికారిగా ఉండటాన్ని మాత్రమే ప్రశ్నించానని సమర్థించుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది దేశ రక్షణ, వ్యవస్థీకృత నేరాల నియంత్రణ కోసం చట్టబద్ధంగా జరిగే ప్రక్రియ అని, దీనిపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ వాదించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గతంలో ట్యాపింగ్ గురించి చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. కేవలం రాజకీయ ప్రతీకారంతోనే బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెడుతున్నారని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై గొంతెత్తడం తన రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఆయన ఉద్ఘాటించారు. తన వ్యాఖ్యలు ఏ అధికారి లేదా రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి ఉద్దేశించినవి కావని ఆయన క్లారిటీ ఇచ్చారు.

రేవంత్ బామ్మర్ది కోసమే సింగరేణి స్కామ్

- భట్టి మాటలతో అది నిజమని తేలిపోయింది
- ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బామ్మర్ది సంతోషం కోసం, తన అనుయాయులకు మేలు చేకూర్చేలా భారీ కుంభకోణానికి తెరలేపారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటలే ఈ స్కామ్ నిజమని నిరూపిస్తున్నాయని పేర్కొన్నారు. సింగరేణి టెండర్ల వ్యవహారంపై భట్టి విక్రమార్క చేస్తున్న సమర్థనలు చూస్తుంటే, ఇందులో భారీ స్కామ్ జరిగిందనేది స్పష్టమవుతోంది. రేవంత్ రెడ్డి తన బామ్మర్ది కళ్లల్లో సంతోషం చూడటం కోసం బొగ్గు గనులను అప్పనంగా కట్టబెట్టాలని చూశారు. టెండర్లు రద్దు చేశామని చెబుతున్న భట్టి, అసలు ఏ కారణంతో రద్దు చేయాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలి. భట్టి విక్రమార్కపై పత్రికల్లో వస్తున్న కథనాల వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ఉన్నారని శ్రవణ్ ఆరోపించారు. "భట్టిపై వార్తలు వేయించిన వ్యక్తి ఎవరు? ఆ కథ, స్క్రీన్ ప్లే మొత్తం రేవంత్ రెడ్డిదే. తన సొంత కేబినెట్ సహచరుడిపైనే లీకులు ఇప్పిస్తున్న సీఎం తీరును భట్టి ఎందుకు ప్రశ్నించడం లేదు? భట్టి ఎవరికి భయపడుతున్నారు?" అని నిలదీశారు. బొగ్గు కుంభకోణాన్ని ఆధారాలతో సహా హరీష్ రావు బయటపెట్టగానే, ప్రభుత్వం తట్టుకోలేక సిట్ నోటీసులతో ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఒకే కేసుపై రెండు సిట్లు ఏర్పాటు చేయడం హాస్యాస్పదమని, ప్రభుత్వం నడుపుతోంది పోలీసులా లేక ప్రజాప్రతినిధులా అని ప్రశ్నించారు. భట్టి తన 40 ఏళ్ల రాజకీయ జీవితం గురించి మాట్లాడుతున్నారు, కానీ 50 ఏళ్ల అనుభవం ఉన్న కేసీఆర్ గారిని సీఎం రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు తిడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఎదుటివారిని గౌరవించినప్పుడే మీకు గౌరవం దక్కుతుందని హితవు పలికారు. పదేళ్లు సీఎంగా ఉండాలని కలలు కనే రేవంత్ రెడ్డి, ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రజల కోసం పని చేయాలని, అక్రమాలకు పాల్పడితే కాలమే సమాధానం చెబుతుందని శ్రవణ్ హెచ్చరించారు.

నిరాడంబరంగా ఐఏఎస్, ఐపీఎస్ వివాహం

- ఐపీఎస్ శేషాద్రిని రెడ్డి, ఐఏఎస్ శ్రీకాంత్ రెడ్డి పెళ్లి
- చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో వివాహం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: ఎంతో ఆడంబరంగా పెళ్లి వేడుకను జరుపుకోవాలని అందరూ భావిస్తారు. పెళ్లి వేడుకను ఘనంగా జరుపుకోవడం కోసం అప్పులు కూడా చేస్తుంటారు. అయితే, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలాంటి ఆడంబరాలు లేకుండా పెళ్లి చేసుకుని ఆదర్శంగా నిలిచారు. ఉన్నత ఉద్యోగాల్లో ఉండి కూడా వారు అతి తక్కువ ఖర్చుతో పెళ్లి చేసుకున్నారు. చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ పెళ్లి జరిగింది. చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడేనికి చెందిన యువ ఐపీఎస్ అధికారిని శేషాద్రిని రెడ్డిని కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ డీసీపీగా శేషాద్రిని రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్ ట్రైనింగ్‌లో ఉన్నారు. వివాహానికి పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ అభివృద్ధికి విశ్రాంత అధ్యాపకుల సలహాలు అవసరం

- వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి
- రిటైర్డ్ అధ్యాపకుల వార్షిక సర్వసభ్య సమావేశం

ప్రతిపక్ష స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి విశ్రాంత అధ్యాపకుల సూచనలు, సలహాలు చాలా అవసరమని, వారి అమూల్యమైన అనుభవాన్ని ఉపయోగించుకోవాలని యూనివర్సిటీ భావిస్తోందని డా. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. శనివారం యూనివర్సిటీలో విశ్రాంత అధ్యాపకుల వార్షిక సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని, యూనివర్సిటీ సర్వతోముఖాభివృద్ధికి రిటైర్డ్ టీచర్స్, గతంలో పాలనా అనుభవం ఉన్న వారి సలహాలు చాలా ముఖ్యమని పేర్కొన్నారు. విశ్రాంత అధ్యాపకులకు ప్రత్యేకంగా యూనివర్సిటీలో ఓ ప్రత్యేక లాంజ్ ఏర్పాటు చేయనున్నట్లు, పరిశోధకులకు గైడ్ చేయడానికి, యూనివర్సిటీ పని పైన వచ్చే రిటైర్డ్ టీచర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకుల సంక్షేమ సంఘం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంబేద్కర్ విశ్వవిద్యాలయ మాజీ ఉప కులపతి ప్రొ. వి. ఎస్. ప్రసాద్; అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ. ఎస్. వి. రాజశేఖర్ రెడ్డి; కార్యదర్శి ప్రొ. సి. వెంకటయ్య; మాజీ రెక్టార్ ప్రొ. కుప్పుస్వామి రావు, మాజీ రిజిస్ట్రార్లు డా. జి. లక్ష్మా రెడ్డి; డా. పి. కృష్ణారావు; మాజీ డైరెక్టర్లు ప్రొ. రామయ్య, డా. పి. విజయలక్ష్మి పండిట్, డా. బనోత్ లాల్; ప్రొ. ఎం. ఎస్. హయత్; ప్రొ. సరస్వతీ రావు, మల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

>
>
> టీ20 వరల్డ్‌కప్ నుంచి వైదొలగడం అనేది మా దేశ ప్రభుత్వ నిర్ణయం. మేం ఆడాలనుకున్నాం. కానీ భారత్‌లో ఆడటం సేఫ్ కాదని మా ప్రభుత్వం వద్దని చెప్పింది. ప్రతి టూర్‌కు ప్రభుత్వ క్లియరెన్స్ తప్పనిసరి. మ్యాచులు జరిగే ఓ సిటీ(కోల్‌కతా) నుంచి మాకు బెదిరింపులు వచ్చాయి. అందుకే అక్కడ ఆడటం సేఫ్ కాదని అనిపించింది.
>
> - బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు డైరెక్టర్ అమ్జద్ హుస్సేన్

ఓపెన్ వాయిస్

సముద్రయాన్ సక్సెస్ కావాలి

చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకుంది. సూర్యుడి మీద కూడా ప్రయోగాలు చేస్తోంది. అంతరిక్షంలో భారతీయ జెండాలు రెపరెపలాడించింది. నింగి, నేల, అంతరిక్షం.. ఇలా మూడు విభాగాలలో భారత్ తన సత్తాను చూపించింది. ఇకపై నీటిలో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోబోతోంది.అంతరిక్ష ప్రయోగాలతో ప్రపంచాన్ని మొత్తం తన వైపు తిప్పుకున్న భారత్.. ఇప్పుడు సముద్రంలో కూడా ప్రయోగాలను మొదలు పెట్టబోతోంది. ఎందుకంటే సముద్రంలో విపరీతమైన ఖనిజాలు.. విలువైన నిక్షేపాలు ఉన్నాయి. ఆ విలువైన నిక్షేపాలను గనుక బయటికి తీస్తే భారత ఆర్థిక ముఖ చిత్రం పూర్తిగా మారిపోతుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అతి త్వరలోనే సముద్రయాన్ ప్రాజెక్టుతో సముద్రపు లోపల ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు కీలక ప్రయోగం చేపట్టనుంది.. రెండేళ్ల క్రితమే సముద్రయాన్ ప్రాజెక్టును ఇస్రో అనౌన్స్ చేసింది.. అందుకోసం ప్రత్యేక సబ్ మెరైన్ ను రూపొందించింది. సముద్రయాన్ మిషన్ అనే ప్రయోగం ద్వారా మహా సముద్రాల అన్వేషణలో భాగంగా సముద్రాల లోపల ఉన్న ఖనిజ సంపదను అన్వేషించడానికి భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకు వేసి మహా సముద్రాలలో ఉన్న ఖనిజ సంపదను కనుగొనేందుకు మత్స్య 6000 అనే సబ్ మెర్సిబుల్ మిషన్ ద్వారా చెన్నై తీరంలోని 5 వేల మీటర్ల లోతులో ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టారు. ఆ తర్వాత మరింత లోతులో పరిశోధనలు చేపట్టనుంది. మన దేశ పరిశోధకులు సముద్రయాన్ ప్రయోగాన్ని మొదలు పెట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా చెన్నై ఆధ్వర్యంలో నాలుగో తరం సబ్ మెరైన్ మత్స్య 6000 ను మే నెలలో సముద్ర జలాల్లోకి ప్రవేశ పెడతారు.డీప్ ఓషియన్ మిషన్ లో భాగంగా ఈ సబ్ మెరైన్ ను రూపొందించారు. 500 మీటర్ల లోతు వరకు ముగ్గురు ఆక్వానాట్స్ ఇందులో ప్రయాణిస్తారు. ఒకవేళ కనుక ఈ ప్రయోగం విజయవంతం అయితే అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ సరసన భారత్ నిలుస్తుంది. సముద్ర జలాల్లో విలువైన నిక్షేపాలతో పాటు, అరుదైన ఖనిజాలు కూడా ఉన్నాయి. కాకపోతే వీటిని అన్వేషించడం అంత సులువు కాదు. సముద్ర అంతర్భాగంలో అత్యంత కఠినమైన వాతావరణం ఉంటుంది. సముద్రాలలో నిత్యం జలాలు ఆటుపోట్లకు గురవుతుంటాయి. అంతర్భాగంలో కూడా విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అలాంటప్పుడు అందులో ప్రయోగాలు చేయడం కత్తి మీద సాము లాంటిది. సబ్ మెరైన్ లు కూడా కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురవుతుంటాయి. ఇన్ని ప్రతికూలతలు ఉన్నాయి కాబట్టి.. సముద్రంలో ప్రయోగాలు చేయడం అంత ఈజీ కాదు. సముద్ర గర్భంలో నిక్షేపాలను బయటకు తీస్తే.. వాటి ద్వారా ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. ప్రయోగం విజయవంతం అయితే 2026 లేదా 2027 చివరిలో మానవ సహిత సముద్రయాన్ ప్రాజెక్ట్ ను ఇస్రో జరుపనుంది. 28 టన్నులు బరువు కలిగిన మత్స్య 6000 అనే సబ్ మెరైన్ మిషన్ ద్వారా ఈ ప్రాజెక్ట్ ను జాతీయ మహా సముద్ర సాంకేతిక సంస్థ ద్వారా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ పర్యవేక్షణలో సముద్రయాన్ మిషన్ ను పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో మానవ సహిత గా ముగ్గురు శాస్త్రవేత్తలను ఎంపిక చేసి ఇందులో ప్రయాణించనున్నారు. అంతరిక్షంలో పరిశోధనలు చేపట్టే శాస్త్రవేత్తలను ఆస్ట్రోనాట్స్ గా పిలుస్తారు. సముద్రం లోపల పరిశోధనలు చేసే వాళ్లను ఆక్వానాట్స్ గా పిలుస్తారు. ఫ్రాన్స్ సహకారంతో భారత్ సముద్రయాన్ ప్రయోగాన్ని చేపడుతుంది. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు సబ్ మెరైన్ లో వెళ్లి పరిశోధన చేస్తారు. అందులో ఇద్దరు భారత కు చెందిన శాస్త్రవేత్తలు ఇప్పటికే పరిశోధనలు మొదలు పెట్టారు. వారిలో జితేంద్ర పాల్ సింగ్, రాజు రమేష్ లు ఇప్పటి వరకు 5000 మీటర్ల లోతు వరకు డైవ్ చేసిన భారత్ రికార్డుగా ఈ ప్రయోగం ద్వారా సాధించారు. ఈ సబ్ మెరైన్ 12 గంటల పాటు పనిచేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో 96 గంటల వరకు కూడా సముద్రంలో ఉండే సామర్థ్యం కలిగి ఉంది. ప్రయోగం ద్వారా సముద్రంలో ఉన్న ఖనిజాలు, ఖనిజ సంపద, మినరల్స్, కోరల్స్ వంటి ఖనిజాలతో పాటుగా సముద్రంలో ఉన్న ఇసుకలో కూడా ఏ తరహా ఖనిజాలు ఉన్నాయి.. వాటి ఉపయోగాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు.ఈ తరహా ప్రయోగాలను ఇప్పటివరకు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్, చైనా లాంటి దేశాలు మాత్రమే చేశాయి.. ఇప్పుడు ఇస్రో కూడా ఈ దేశాల సరసన చేరనుంది. ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగానికి సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఇస్రో ఒకవైపు గగన్ యాన్ ద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు సిద్ధమవుతూనే సముద్రం లోపల శాస్త్రవేత్తల ద్వారా అత్యంత క్లిష్టమైన కీలకమైన ప్రయోగ ప్రక్రియను పూర్తిచేసే దశలో ఉండటం గర్వకారణమని పలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా భారత ఆర్థిక ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది. భారత్ అభివృద్ధి చెందిన దేశంలా కాకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందుతుంది. ఉపాధి కోసం మన దేశ యువత విదేశాలకు వెళ్లకుండా.. ఇక్కడే పనిచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
25.01.2026

ఓటు.. వజ్రాయుధం!

“నా దేశ ప్రజల చేతికి కత్తిని ఇవ్వలేదు, ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చాను. పోరాడి రాజులే అవుతారో, అమ్ముకొని బానిసలుగా ఉంటారో వారి చేతుల్లోనే ఉంది” అని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనడాన్ని బట్టి ఓటు ప్రాముఖ్యత మనకు అవగతం అవుతుంది. 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం (ECI)స్థాపించిన రోజును గుర్తు చేసుకుంటూ ఎన్నికల్లో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు, ఓటింగ్ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు గాను 2011 నుండి జనవరి 25న ఓటర్ దినోత్సవం గా ప్రతి ఏటా వేడుకలు నిర్వహిస్తున్నాం.

ములక సురేష్
9441327666

నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం యువతను ఓటర్లుగా నమోదు చేయడం, వారికి ఓటరు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం పై దృష్టి పెట్టింది. మన దేశంలో మొదటిసారిగా 1920లో ఎన్నికలు జరిగాయి అప్పటికి మనల్ని ఆంగ్లేయులు పరిపాలిస్తున్నారు స్వాతంత్ర పోరాటం చివరి అంకానికి చేరుకునే రోజులవి అప్పుడు కేవలం పట్టభద్రులైన వారికి, ఐదు ఎకరాల కంటే భూమి ఎక్కువగా ఉండి భూమిశిస్తూ కట్టే వారికి ,ఆస్తిపన్ను కట్టే వారికి మాత్రమే ఓటు హక్కు ఉండేది. అంటే జనాభాలో కేవలం 12 శాతం మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యేవారు. అయితే ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలే కీలకం కావున సామాన్యుడు ఓటు హక్కు కోసం సార్వత్రిక ఓటింగ్ సాధించే వరకు నిరంతరం పోరాడిన భారత భాగ్య విధాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.1919లో భారత ప్రజలను పరిపాలనలో భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతో బ్రిటిష్ పాలకులు సౌత్ బరో అనే రాజకీయ నిపుణుడి నాయకత్వంలో ఒక కమిటీని వేశారు .తన జాతి జనుల విముక్తి కోసమే కాక అన్ని వర్గాల ప్రజల కోసం తపించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆ కమిటీకి ఇచ్చిన నివేదికలో ప్రజాస్వామ్య తాత్వికతకు పునాది వేశాడు. ఆ పునాదులే రాజ్యాంగ రచనకు ఆధారమయ్యాయి. నేటి ప్రజాస్వామ్య సౌధాన్ని నిలబెట్టడానికి సాధనాలు అవుతున్నాయి. ఆ నివేదికలో అంబేద్కర్ ప్రజాస్వామ్యం అంటే ప్రజలకు ప్రాతినిధ్యం ఉండాలి కానీ కొద్ది మందికి మాత్రమే ఓటు హక్కు ఉండటం నిరంకుశత్వానికి, నియంతృత్వానికి, అప్రజాస్వామ్యానికి సూచిక అవుతుంది .కావున వయోజనులైన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కచ్చితంగా ఉండాలని ప్రతిపాదించాడు .కానీ సౌత్ బరో కమిటి ఆ ప్రతిపాదనలను తోసిపుచ్చింది.ఆ కమిటీ సిఫారసులకు అనుగుణంగా బ్రిటిష్ పాలకులు 1920లో మొట్టమొదటిసారి ఎన్నికలు నిర్వహించారు. 1928 లో బ్రిటిష్ ప్రభుత్వం సర్ జాన్ సైమన్ చైర్మన్ గా మరో కమిటీని భారతదేశానికి పంపింది, దేశ పర్యటన చేసి సామాజిక స్థితిగతులను అధ్యయనం చేసే క్రమంలో ఆ కమిటీకి కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 21 ఏళ్లు నిండిన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు ఉండాలంటూ తన నివేదికను సమర్పించారు. అయితే కాంగ్రెస్ “సైమన్ గో బ్యాక్ “అంటూ నినదించి ఆ కమిటీ సిఫారసులు అమలు కాకుండా చేసింది. 1930; 1931 లలో లండన్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాలలో అణగారిన వర్గాలతో పాటు అందరికీ పాలనలో భాగస్వామ్యం దక్కాలని అంబేద్కర్ పట్టుబట్టి నా బ్రిటిష్ ప్రభుత్వం అందరికీ ఓటు హక్కు అనే విషయాన్ని పట్టించుకోలేదు. 1935లో మొదటిసారిగా వచ్చిన భారత చట్టంలోనూ సార్వత్రిక ఓటింగ్ కు అవకాశం రాలేదు. 1937మరియు 1946లో జరిగిన ఎన్నికల్లో కూడా గతంలో మాదిరిగానే కేవలం విద్యావంతులకు, వ్యాపారులకు, భూస్వాములకు మాత్రమే ఓటు హక్కు కల్పించారు. వాళ్ల ప్రతినిధులు మాత్రమే పార్లమెంటులో, అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1947 లో భారతదేశం స్వాతంత్రం సాధించడంతో నూతన రాజ్యాంగాన్ని

రూపొందించుకుని అవకాశం దక్కింది .అనేక దేశాల్లో వచ్చిన విప్లవాలు మార్పులు ,పరిణామాలను అర్థం చేసుకొని ఒక రాజ్యాంగం ఆవశ్యకతను గుర్తించి దాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం అనివార్యమైంది .ఆ క్రమంలోనే రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అంబేద్కర్ నాయకత్వం వహించడం తద్వారా సార్వత్రిక ఓటింగ్ హక్కును ఆర్టికల్ 326 లో ఉంచడం జరిగింది. 61వ రాజ్యాంగ సవరణ చట్టం 1988 ద్వారా వయోజన ఓటు హక్కు ను 18 ఏళ్లకు తగ్గించారు .ఇది 1989 మార్చ్ 28 నుండి అమలులోకి వచ్చింది .1989 లోక్ సభఎన్నికల్లో 18 ఏళ్ల ఓటర్లకు మొట్టమొదటిసారిగా ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభించింది. దేశ గతిని మార్చగల శక్తి ఒక్క ఓటు కే ఉన్నది అలాంటి ఆయుధాన్ని వృధా చేసుకోవడం లేదా ప్రలోభాలకు లోనై అమ్ముకోవడం రాజ్యాంగ విరుద్ధం. ఓటు ఒక వ్యక్తి అస్తిత్వాన్ని గుర్తించి, వ్యవస్థ మార్పుకు నాంది పలుకుతుంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉన్నత నాయకులని ఎన్నుకునే ప్రక్రియలో ప్రధాన భూమిక ఓటు. ప్రతి పౌరుడు తన ఓటుని వినియోగించుకుని సరైన నాయకుడి ని ఎన్నుకున్నప్పుడు అంబేద్కర్ ఆశయాలు, ఆయన కలలు నెరవేరతాయి. పురుషులతోపాటు మహిళలకు కూడా సమాన ఓటు హక్కు అంబేద్కర్ కల్పించాడు. ఓటు హక్కును నైతికంగా ,న్యాయంగా వినియోగించుకోవాలి. అదే ప్రధాన కర్తవ్యం .ఏ దేశంలోనైనా ప్రజలే న్యాయ నిర్ణేతలు.వారి మనోభావాలను ప్రకటించుకునేందుకు ప్రజల చేతిలో పదునైన ఆయుధం ఓటు. నీతి ,నిజాయితీ కలిగి, బాధ్యతగల నాయకులను గెలిపించి చట్టసభలకు పంపిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతగా పనిచేసే నాయకులను ఎన్నుకోవడం మన కర్తవ్యం. రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.ప్రలోభాలకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు పట్టిస్తున్నారు. ఓటు నోటుకు లొంగిపోతే ప్రజలు బానిసత్వంలోకి వెళ్లడం ఖాయం. యువత దేశానికి వెన్నెముక. యువత ఎక్కువగా ఓటు వేస్తే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది .కొత్త ఆలోచనలు, కొత్త సంస్కరణలు, జవాబుదారీతనం ఇవన్నీ ముందుకు నడిపే శక్తి యువతకు ఉంది. ఓటర్లు చురుకుగా ఉంటే రాజకీయ నాయకులు యువ సమస్యల పై గంభీరంగా పనిచేస్తారు. కానీ నేటి యువతలో కేవలం 60 నుండి 65% మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు దీనికి కారణం వారు సామాజిక సమస్యల పట్ల అవగాహన లేకపోవడం మాత్రమే కాదు ఓటు విలువను గుర్తించకపోవడం కూడా ముఖ్య కారణం. గ్రామీణ ప్రాంతంలో 75% వరకు ఓటు హక్కును వినియోగించుకుంటుంటే పట్టణ ప్రాంతాల్లో కేవలం 55% మాత్రమే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఎన్నికల రోజును సెలవు దినంగా భావించడం, అలసత్వం, ఒక్క ఓటుతో ఏ మార్పు రాదన్న భావన పట్టణ ప్రాంతాల్లో బలంగా ఉండటం వారి బాధ్యత రాహిత్యానికి పరాకాష్ట. రాజకీయాలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్న పరిస్థితి మనకు కనబడుతుంది .కాంట్రాక్టర్లు ,పారిశ్రామికవేత్తలు ,వ్యాపారవేత్తలు ,భూస్వాములు ఇలా కేవలం ధనవంతులు మాత్రమే రాజకీయాల్లో మనుగడ సాగించడం ప్రజాస్వామ్య విలువలకు గొడ్డలి పెట్టు లాంటిది .ప్రజల తాత్కాలిక అవసరాలను గుర్తించి వారి ధనంతో ప్రలోభ పెట్టి ఓటును కొనుగోలు చేసే దుర్మార్గపు చర్యలను ఓటర్లకు అవగతమయ్యేటట్లు తెలిపి వారు దేశ భవిష్యత్తు కోసంసరియైన నాయకులను ఎన్నుకునే విధంగా వారికి అవగాహన కల్పించడం ప్రజాస్వామికవాదులుగా మనందరి కర్తవ్యం.

(తెలంగాణ చైతన్య వేదిక)

సమీకృత గురుకుల విద్యా విధానం ఒక సరికొత్త విప్లవం

డాక్టర్. అజయ్ కుమార్ రౌతు
986655970

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమీకృత గురుకుల విద్యా విధానం విద్యారంగంలో ఒక విప్లవాత్మక అడుగుగా నిలవనుంది. సామాజిక-ఆర్థిక అసమానతలను తగ్గించడంలో విద్యనే ప్రధాన ఆయుధంగా భావించిన రాష్ట్ర ప్రభుత్వం, కుల-మత-వర్గ వివక్షలకు తావు లేకుండా పేద, నిరుపేద గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాన్ని ఆధునిక మౌలిక వసతులతో నిర్మించాలన్న ఆలోచన తెలంగాణ విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా భావించవచ్చు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా, అంతర్జాతీయ స్థాయిలో విద్యను ఆహ్లాదకరమైన వాతావరణంలో అందించాలన్న సంకల్పం సమాజంలోని సబ్బండ వర్గాల్లో సరికొత్త ఆశలను ఆశయాలను నింపుతోంది. భవనాల నిర్మాణం, వసతుల కల్పన ఎంతో ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ, విద్యను ప్రాథమిక రంగంగా భావించిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో గణనీయమైన కేటాయింపులు చేయడం అభినందనీయం. ఒకప్పుడు, దాదాపు మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వర్గాల విద్యార్థులు కుల-మత-వర్గ వివక్షలకు తావు లేకుండా విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి చేరారు. ఆ తరం విద్యార్థులు సామాజిక సమన్వయం, సహనుభూతిని కలిగి సమాజ అభ్యున్నతి కోసం వివిధ రంగాల్లో నేటికీ నిస్వార్థంగా సేవలందిస్తున్నారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి క్రమంగా కనుమరుగవుతోంది. ప్రైవేటు విద్యారంగం గణనీయంగా విస్తరిస్తున్న కొద్దీ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య అదే స్థాయిలో తగ్గుతూ వచ్చింది. ప్రైవేటీకరణ పరాకాష్ఠకు చేరిన కార్పొరేటీకృత విద్యారంగంలో విద్య సామాన్యుడికి అందని ద్రాక్షగా మారింది. ఫలితంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేటు విద్య మోజుతో ఆర్థికంగా చితికిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పిస్తున్న గురుకుల విద్యాసంస్థలకు విశేష ఆదరణ పెరిగింది. దివంగత పీవీ నరసింహారావు గారి దూరదృష్టితో 1971 లో నల్గొండ జిల్లా సర్వేయల్ లో స్థాపించిన గురుకుల పాఠశాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. అక్కడ విద్యనభ్యసించిన మహేందర్ రెడ్డి, రామకృష్ణ రావు, బుర్ర వెంకటేశం వంటి వారు నేడు ప్రముఖ స్థానాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అదే స్ఫూర్తితో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు స్థాపించబడ్డాయి. నాటి ఐఏఎస్

అధికారి ఎస్.ఆర్. శంకరణ్ గారి చొరవతో ఏర్పాటైన ఈ పాఠశాలలు అనేక మంది దళిత విద్యార్థుల అభ్యున్నతికి దోహదపడ్డాయి. క్రమంగా ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల కోసం కూడా ప్రత్యేక గురుకులాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం గురుకులాల సంఖ్య 1040కి చేరుకుంది. ఈ క్రమంలో వివిధ గురుకుల సొసైటీలను ఒకే క్యాంపస్ లో సమీకరించి సమీకృత గురుకుల క్యాంపస్ లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఇప్పటికే ఆదేశించారు. ఈ నిర్మాణాలు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికే ప్రారంభించాలనే ఆశాభావాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది.అయితే దాదాపు 3000 మంది విద్యార్థులు ఉండే ఒక క్యాంపస్ ను మినీ యూనివర్సిటీ స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించడం నిర్వాహకులకు కత్తిమీద సాములాంటిదే. అయినప్పటికీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో, మంచి ఉద్దేశంతో ముందుకు సాగుతున్న తరుణంలో, రేపటి గురుకుల విద్యా వ్యవస్థ సమర్థవంత నిర్వహణకు ఖచ్చితమైన దారులు ఏర్పడతాయనే విశ్వాసం ప్రతి ఒక్కరిలో ఉండాల్సిందే. ఈ విప్లవాత్మక నిర్ణయపు వెలుగులో కామన్ గురుకుల విద్యా విధానం రూపకల్పనకు బాటలు పడే అవకాశాలపై చర్చ మొదలైంది. ఇప్పటికే ప్రభుత్వం కామన్ మెనూ ప్రవేశపెట్టిన నేపథ్యంలో, కామన్ గురుకుల విద్యా విధానాన్ని కూడా తీసుకువస్తుందనే అభిప్రాయాలకు మరింత బలం చేకూరుతోంది. వాస్తవానికి ఒక్కో శాఖలో ఒక్కో రకమైన విధి విధానాలు ఉండడం శ్రేయస్కరం కాదు. ఎందుకంటే ఉద్యోగుల రిక్రూట్మెంట్ ,ప్రమోషన్లు ,వేతనాల్లో తారతమ్యం ఉండటం వల్ల వారి ఆలోచనలపై, పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ఏకరూప రిక్రూట్మెంట్, పని విధానాల్లో సారూప్యత ఉన్నప్పటికీ, ప్రమోషన్లు మరియు వేతనాల్లో తేడాలు ఉద్యోగుల అసంతృప్తికి దారితీస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో మొత్తం గురుకుల విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే అంశాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. ఇటీవల ప్రభుత్వం రూపకల్పన చేస్తున్నా తెలంగాణ విద్యా బిల్లులో కామన్ గురుకుల విద్యా విధానమనే అంశాన్ని చేర్చి తెలంగాణ గురుకుల విద్యావ్యవస్థను ఒకే గొడుగు కిందికి తీసుకు రావడమా లేక కనీసం కామన్ డైరెక్టరేట్ ఏర్పాటుచేయడం వల్ల సమీకృత గురుకుల విద్యా విధాన స్ఫూర్తికి సార్థకత చేకూరడమే కాకుండా, మొత్తం గురుకుల విద్యా వ్యవస్థలో ఒక సరికొత్త విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని మా గురుకుల విద్యాసంస్థల అసోసియేషన్లు విజ్ఞప్తి చేస్తున్నాయి.

(వ్యాస రచయిత అధ్యక్షులు,
తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్)

‘డిజిటల్ ఉపవాస’ వ్రతం చేపడదాం!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సాంకేతిక విప్లవం మూడు ట్యాబులు ఆరు స్మార్ట్‌ఫోన్లుగా విస్తరిస్తోంది. కంప్యూటర్ యుగంలోంచి డిజిటల్ యుగంలోకి అడుగిడిన నవ్య ఏఐ నరుడి జీవనశైలి సమూలంగా మారిపోయింది. డిజిటల్ వెలుగులు మానవాళి కళ్లకు నీలి తెరలు కప్పేస్తున్నాయి. అంతర్జాలం విశ్వవ్యాప్తం అయ్యింది. స్మార్ట్‌ఫోన్ లేకుండా బతుకులు అంధకారమయం అయ్యాయి. సమాచార సేకరణ, కమ్యూనికేషన్, వ్యాపారం, విద్య, వినోదాల కోసం తెరలను ఆశ్రయిస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ నీలి తెరలకు బానిసలుగా మారిపోతున్నాం. ప్రపంచ మానవాళి రోజుకు సగటున 6.5 -7.0 గంటల పాటు స్క్రీన్ టైమ్ గడుపుతున్నారు. ఇండియాలో సహితం సగటున 5.0 7.4 గంటల పాటు స్మార్ట్ తెరలకు అతుక్కుపోతున్నారు.

స్మార్ట్ తెరలతో మహా చిక్కులు:

స్మార్ట్‌ఫోన్, ఐప్యాడ్, ల్యాప్‌టాప్, కంప్యూటర్, టీవీ, టాబ్లెట్ లాంటి స్మార్ట్ ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మన ఇండ్లల్లో నిత్యావసరాలు అయ్యాయి. పని పిల్లల నుంచి పండు ముసలి వరకు అందరూ ప్రతి రోజు గంటల పాటు అవసరం ఉన్నా లేకున్నా ఆయా కాంతివంతమైన తెరలకు అతుక్కుపోతున్నారు. రోజులు, వారాలు, మాసాలు, ఏండ్ల పాటు స్క్రీన్ టైమ్ పెరగడంతో మన శరీరాలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. స్క్రీన్ టైమ్ పెరగడం కారణంగా మానసిక ఒత్తిడి పెరగడం, ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, పనిలో ఉత్పాదకత పడిపోవడం, కంటి జబ్బులు కమ్ముకోవడం, మయోపియా, మెడ నొప్పులు, భుజం నొప్పులు, తలనొప్పి, మెదడుపై తీవ్ర ప్రభావాలు చూపడం లాంటి ప్రమాదకర ప్రతికూల లక్షణాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగాల్లో భాగంగా రోజుకు 8-10 గంటలు నీలి తెరల ముందు స్మార్ట్ వర్క్ చేసే ఉద్యోగుల ఆరోగ్యాలు గాల్లో దీపాలు అవుతున్నాయి. పిల్లలు, విద్యార్థులు, యువత, మహిళలు సహితం అనవసరమైన, ప్రయోజనం లేని సామాజిక మాధ్యమాల్లో తలదూర్చి తమ విలువైన సమయం, ఆరోగ్యాలకు కోల్పోతున్నారు. ఈ ప్రమాదకర సమస్యకు విరుగుడుగా వచ్చిందే “డిజిటల్ ఉపవాసం” లేదా “డిజిటల్ ఫాస్టింగ్” అనబడే సానుకూల ప్రక్రియ అని తెలుసుకోవాలి.

డిజిటల్ ఉపవాసం అనగా ఏమిటి !

ఒక వ్యక్తి నిర్దిష్ట సమయం (గంటలు లేదా రోజుల పాటు) పాటు డిజిటల్ తెరలను దూరంగా ఉండాన్ని “డిజిటల్ ఉపవాసం” లేదా “డిజిటల్ ఫాస్టింగ్” అని నిర్వచిస్తున్నారు. డిజిటల్ తెరలను విరామం ఇవ్వడం ద్వారా కళ్లకు విశ్రాంతి, మనసుకు ప్రశాంతత, శారీరక ఉపశమనం, సరిగ్గా నిద్ర పోవడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. రోజుకు కొన్ని గంటలు లేదా వారంలో ఒకటి లేదా అంత కన్న ఎక్కువ రోజులు స్క్రీన్‌లకు దూరంగా ఉండడం మన దినచర్యలో భాగం కావాలి. 20-20-20 నియమం ప్రకారం, తెరల ముందు 20 నిమిషాల గడిపిన తర్వాత 20 అడుగుల దూరంలో ఉన్న ఏదైనా వస్తువులను కొన్ని సెకన్ల పాటు చూడడం అలవర్చుకోవాలి. తెరల్లో మునిగిన పుడు గదిలో సరైన వెలుతురు ఉండే విధంగా చూసుకోవాలి. స్మార్ట్ తెరల్లో మునిగే వారు తరుచుగా నీరు తాగాలి. ఒగ



గంట లేదా గంటన్నర తర్వాత ఐదు నిమిషాలు విరామం తీసుకోవడం మరువరాదు. వీటితో పాటు రోజుకు కనీసం 4 5 గంటల పాటు తెరలను మూసి వేసి డిజిటల్ ఉపవాస వ్రతం పట్టాలి.

డిజిటల్ ఉపవాసం - డిజిటల్ డీటాక్స్:

స్క్రీన్ టైమ్ తగ్గించడాన్ని ‘డిజిటల్ డీటాక్స్’గా అర్థం చేసుకోవాలి. డిజిటల్ ఉపవాసం తీసుకున్న సమయాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడుపుతూ మానసిక శారీరక ఉపశమనం పొందాలి. కరోనా తర్వాత ఆన్‌లైన్ కోర్సులు లేదా తరగతుల ఉద్యమం రావడంతో పరిస్థితులు మన చేయి దాటాయి. పిల్లలు, యువత చేతుల్లో మనమే స్మార్ట్ ఫోన్లు పెట్టాల్సిన అగత్యం ఏర్పడింది. స్క్రీన్ నుంచి విరామం తీసుకోవడం మన జీవనశైలిలో భాగం చేసుకోవాలి. వారానికి కనీసం ఒక రోజు డిజిటల్ ఉపవాసం ఆచరించాలి. రోజుకు కొన్ని గంటలు ‘డిజిటల్ ఫాస్టింగ్’ను ఆశ్రయించాలి. ‘డిజిటల్ ఫ్రీ జోన్’ సమయంలో పుస్తకాలు చదవడం, ఆత్మీయులతో గడపడం, నోటిఫికేషన్లను ఆఫ్ చేయడం, ఆఫ్‌లైన్ కార్యాలకు పూనుకోవడం లాంటివి ఆచరణలో పెట్టాలి. ముఖ్యంగా నేటి పిల్లలు, యువతను డిజిటల్ తెరలకు దూరంగా ఉంచడానికి డిజిటల్ ఉపవాస ప్రక్రియను ఆచరణలోకి తీసుకొని వద్దాం.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ ‘ఓపెన్ వాయిస్’కు, సాహిత్య పేజీ ‘బహుళ’కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

'వికసిత్ భారత్ 2047' లక్ష్యంగా ఉద్యోగ మేళాలు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- చాంద్రాయణగుట్ట సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో 18వ విడత ఉద్యోగ మేళా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించే ప్రయత్నాల్లో భాగంగా అన్ని మంత్రిత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి నిర్దిష్ట కాలపరిమితితో నియామక ప్రక్రియలను చేపడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్ర జి. కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో గల సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన 18వ విడత ఉద్యోగ మేళాలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాల్లో నియామక ప్రక్రియ క్రమబద్ధీకరణ, వేగవంతం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు 2022 నుంచి రోజ్‌గార్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. "కొత్తగా ఉద్యోగాల్లో నియమితులైన యువత వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తారు" అని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా... అంకుర సంస్థలను ప్రోత్సహించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి కల్పనను పెంచడంపై కేంద్రం దృష్టి సారించిందని ఆయన తెలిపారు. "ప్రస్తుత ప్రపంచ అనిశ్చితుల మధ్య ప్రపంచ దేశాలకు భారత్ నమ్మకమైన గమ్యస్థానంగా ఉంది. ఆయా దేశాల నుంచి వచ్చే కొత్త పెట్టుబడులు మన దేశంలో ఉద్యోగాలను సృష్టించడంలో సహాయపడతాయి" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 213 మంది అభ్యర్థులకు కేంద్ర మంత్రి నియామక పత్రాలను అందజేశారు. సీఆర్‌పీఎఫ్‌లో 179, ఎస్‌ఎస్‌బీలో 5, ఐటీబీపీలో 16, బీఎస్‌ఎఫ్‌లో 5, ఐఎఫ్‌ఎల్‌యూలో 1, ఐఐటీహైదరాబాద్‌లో 3, బ్యాంక్ ఆఫ్ బరోడాలో 1, విద్యా మంత్రిత్వ శాఖలో 3 ప్రొఫెసర్ పోస్టులు వీటిలో భాగంగా ఉన్నాయి. ఉద్యోగం పొందిన వారిలో 15 మంది మహిళలు ఉన్నారు. సౌత్ జోన్ మెడికల్ ఐజీ గణేష్‌చంద్ర పాడి, హైదరాబాద్ సెంటర్ డీఐజీ ఉదయ భాస్కర్ బిల్లా, కమాండెంట్ మోహన్ దాస్ కోబ్రుగాడే సహా సీనియర్ సీఆర్‌పీఎఫ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 18వ రోజ్‌గార్ మేళాను దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో నిర్వహించారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి కొత్తగా నియమితులైన 61,000 మంది అభ్యర్థులు... హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్యంకుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, ఉన్నత విద్యా విభాగం సహా భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో చేరనున్నారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో
దోషులకు శిక్షలు తప్పవు

- రాజకీయ కక్ష అని అనడం సరికాదని
- ఫోన్‌ట్యాపింగ్ అనేది చాలా దుర్మార్గం
- మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: ఫోన్‌ట్యాపింగ్ కేసులో దోషులను కఠినంగా శిక్షపడేలా చూస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఫోన్‌ట్యాపింగ్ అనేది చాలా దుర్మార్గమని.. దానిని రాజకీయ కక్ష అని అనడం సరికాదని ఆయన అన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేశారు. ఫోన్‌ట్యాపింగ్‌లో పాత్రధారులెవరో, సూత్రధారులెవరో తెలియాల్సి ఉందన్న మంత్రి.. దీనిని దిగజారుడు తనమే అంటారని చెప్పుకొచ్చారు. ప్రజాధనంతో నడిచేది విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ అని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసినా చూస్తూ ఊరుకోవాలా? దర్యాప్తు జరిపించవద్దా.? అని ప్రశ్నించారాయన. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తాం..ఫోన్‌ట్యాపింగ్ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామని మంత్రి జూపల్లి తెలిపారు. ఫోన్.. ట్యాపింగ్ అవుతుందని వి.ప్రకాశ్ అనే వ్యక్తి ఆరోజే చెప్పారని ప్రస్తావించారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ కూడా ఫోన్‌ట్యాపింగ్ అయిందని గతంలో మాట్లాడారని గుర్తుచేశారు. ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి సైతం ఈ అంశం గురించి మాట్లాడారని చెప్పుకొచ్చారు. మాజీ గవర్నర్ తమిళసై ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని చెప్పారని ప్రస్తావించారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరి కొందరి ఫోన్లు ట్యాపింగ్ అయ్యిండొచ్చని ఒప్పుకున్నారని జూపల్లి అన్నారు. తెలంగాణ రాష్టం ఏర్పాటు చేసుకున్నది ప్రజల సమస్యలు పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని.. నేరస్థులుగా పరిగణించలేదని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సాక్షిగా సమాచారం కోసమే పోలీసులు కేటీఆర్‌ను విచారణకు పిలిచారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో పాటు కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌నూ గతంలో అక్రమంగా అరెస్ట్ చేశారని వెల్లడించారు. చట్టం ప్రకారం నోటీసులిచ్చి పోలీసులు విచారిస్తారని చెప్పారు. ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు.. అమెరికాకు ఎందుకు వెళ్లిపోయారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు అమెరికా నుంచి ఇండియాకు వచ్చారని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు రావడానికి చాలా కారణాలున్నాయని చెప్పారు. పార్టీలకు అతీతంగా అందరూ విచారణకు వచ్చారని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

పంటల ధర నిర్ణయ అధికారం రైతులకు ఉండాలి

- మార్కెట్లో మోసాల నియంత్రణ బాధ్యత ప్రభుత్వానిదే
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి
- వ్యవసాయ శాఖ రిటైర్డ్ అధికారుల సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: పంట ధరల నిర్ణయ అధికారం రైతులకు ఉండాలని, మార్కెట్‌లో మోసాల నియంత్రణ బాధ్యత ప్రభుత్వాలదేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వ్యవసాయ శాఖ రిటైర్డ్ అధికారుల సంఘం రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎంత చేసినా తక్కువేనని, రైతుల సంక్షేమం కోసం ఇతోధికంగా ప్రభుత్వం చేయూతను అందించాలని పేర్కొన్నారు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని, దళారులు, వ్యాపారుల పాత్ర తగ్గాలని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 68 లక్షల మంది రైతులు, 75 లక్షల కమతాలు ఉన్నాయని, ఖరీఫ్ సీజన్ కు నెల రోజులు వ్యవసాయ శాఖ అధికారులు విధిగ భూసార పరీక్షలు చేసి రైతులకు సూచనలు చేయాలి. ఎరువులు ఏ మోతాధులో వాడాలి, ఏ పంటలు వేయాలి అన్న సూచనలు ఇవ్వాలి అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. భూమితోపాటు విత్తనం, నీరు ముఖ్యం అని అన్నారు. కొన్ని పంటలు కనుమరుగు అవుతున్నాయి. ఆముదం, చెరుకు, పసుపు, పత్తి, మిర్చి, పప్పు దినుసులు వంటి పంటల సాగు తగ్గుతున్నాయని చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నీళ్లు సమృద్ధిగా ఉంటే రైతులు బంగారం పండిస్తారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు తగ్గించాలి. మార్కెటింగ్ ముఖ్యం. వ్యాపారులు పంట ధర తగ్గిస్తే పోలీస్ కేసులు పెట్టాలి అని చిన్నారెడ్డి తెలిపారు. పత్తి ధర దారుణంగా పడిపోతోందని, కాటన్ టూ క్లోత్ పద్ధతి అవలంభించాలని, వడ్ల నుంచి బియ్యం చేసి రైతులు లాభం గడించాలని, వ్యవసాయంలో పూర్వ వైభవం రావాలి అని అన్నారు. వ్యవసాయం అధికారి అటవీ అధికారి, మహిళా సంఘాలతో కలిసి చెట్లు పెంచాలన్నారు. విశ్రాంత వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, వారి సేవలు ప్రభుత్వం ఉపగించుకోవాలని చిన్నారెడ్డి అన్నారు. వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ విశ్రాంత అధికారులు తమ సూచనలు, సలహాలు ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో పంటల మార్పిడి అవసరం. సాంప్రదాయ వ్యవసాయం అవసరం అని అన్నారు. ఈ సదస్సులో వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బొమిరెడ్డి కృపాకర్ రెడ్డి, రిటైర్డ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రంగారెడ్డి, రైతు కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన
39 మంది మైనర్లతో సామాజిక సేవ

- తల్లిదండ్రులకు రూ.5,000 జరిమానా

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 24: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన 39 మంది మైనర్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఛార్జ్‌షీట్లు దాఖలు చేసి, నేడు వారిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసును విచారించిన మెజిస్ట్రేట్ నిబంధనలు ఉల్లంఘించిన మైనర్లకు వినూత్న శిక్ష విధించారు. మరుసటి రోజు సిద్దిపేటలోని కోమటి చెరువు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. అలాగే, మైనర్లకు వాహనాలు ఇచ్చినందుకు గాను వారి తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున భారీ జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు అప్పగించడం ద్వారా వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టినట్లవుతుందని తల్లిదండ్రులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.

ఓయూ ఖబరస్తాన్ సమస్యలు పరిష్కరిస్తాం

- తక్షణమే పిచ్చి మొక్కల తొలగింపు, చెట్ల కొమ్మల కొట్టివేత
- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి
- పారిశుద్ధ్య సమస్యలపై ఆకస్మిక తనిఖీ

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 24: ఉస్మానియా యూనివర్సిటీ ముస్లిం ఖబరస్తాన్‌లో నెలకొన్న పారిశుద్ధ్య నిర్వహణ లోపాలపై కమిటీ సభ్యుల వినతుల మేరకు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి శనివారం అక్కడ ఆకస్మికంగా పర్యటించారు. ఈ తనిఖీలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి పాల్గొన్నారు. కబ్రస్తాన్ ప్రాంగణంలో విస్తరించిన పిచ్చి మొక్కలు, నియంత్రణ లేకుండా పెరిగిన చెట్ల కొమ్మలు, పేరుకుపోయిన చెత్త, డ్రెయినేజీ సమస్యలు, తాగునీటి వసతుల లేమి, చుట్టూ రక్షణ కంచె లేకపోవడం వంటి సమస్యలను కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పిచ్చి మొక్కలు మరియు చెట్ల కొమ్మల కారణంగా సమాధుల ప్రాంతానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముస్లిం శ్మశాన వాటికల నిర్వహణకు జీహెచ్ఎంసీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, తక్షణమే పిచ్చి మొక్కల తొలగింపు, చెట్ల కొమ్మల కొట్టివేత, సమగ్ర పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, కబ్రిస్తాన్ నిర్వహణను సక్రమంగా చేపడతామని కమిటీ సభ్యులకు ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ముస్లిం స్మశాన వాటిక అధ్యక్షులు జరురుద్దీన్, రషీద్, యాకూబ్ షరీఫ్, ఖాదిర్, కుదూస్ అక్బర్ భాష, అలీ ఖాలిద్, ఖాజా పాషా, యాకూబ్, ముజాయుద్దీన్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు హుస్నాబాద్ డిపో సిద్ధం

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 24: మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హుస్నాబాద్ ఆర్టీసీ డిపో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతర పురస్కరించుకుని ప్రత్యేక బస్సుల నిర్వహణపై డిపో మేనేజర్ వెంకన్న నాయక్ శనివారం వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హుస్నాబాద్ డిపో నుండి 35 బస్సులతో పాటు ఇతర డిపోల నుండి మరో 15 బస్సులను సేకరించి, మొత్తం 50 ప్రత్యేక బస్సులను మేడారానికి నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఛార్జీలను ఖరారు చేశామని, పెద్దలకు 350 రూపాయలు, పిల్లలకు 200 రూపాయలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌కు వచ్చే భక్తులకు ఎండ తగలకుండా టెంట్లు, రాత్రి సమయంలో ఇబ్బంది లేకుండా విద్యుత్ దీపాలు, దాహార్తి తీర్చడానికి తాగునీటి వసతిని కల్పించామన్నారు. టికెట్ల జారీలో జాప్యం జరగకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశామని, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని డిఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది మురళి, తిరుపతి గౌడ్, సురేష్, వెంకటేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగనాధుడి కళ్యాణంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 24 : అందోల్ లోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రం నందు శనివారం భూనీళా సమేత శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణోత్సవంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామాన్య భక్తులతో కలసి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం, శ్రీ రంగనాథ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మార్కెఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి ,సురేందర్ గౌడ్, కృష్ణా రెడ్డి, చిట్టిబాబు , రామకృష్ణ ,ప్రవీణ్, మున్నూరు కిషన్ , ప్రదీప్ గౌడ్ లు పాల్గోన్నారు.

ఎన్ని కోట్లయినా తెస్తాం.. షాద్ నగర్ ను అభివృద్ధి చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి
- రెండేళ్లలో 1,350 కోట్ల నిధులు ఆషామాషీ కాదు

ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 24 : షాద్ నగర్ మున్సిపల్ అభివృద్ధికి ఎన్ని కోట్ల నిధులైనా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మున్సిపాలిటీని అందరి సహకారంతో ఆదర్శవంతంగా తీర్చి దిద్దుకుంటామని షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఈడెన్ ప్లాజా ఫంక్షన్‌హాల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధికి నిదర్శనంగా ఒక్క పిలుపు మేరకు గ్రామాల నుండి వేల సంఖ్యలో కార్యకర్తలు నాయకులు వచ్చారన్నారు. షాద్ నగర్ పట్టణంలో కనీవిని ఎరుగని రీతిలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ బ్రహ్మాండంగా జరిగిందన్నారు. రెండు సంవత్సరాల వ్యవధిలో 1350 కోట్ల నిధులు వచ్చాయంటే మామూలు విషయం కాదు అన్నారు. ఏడాదిలోపు అనుకున్న లక్ష్యాన్ని సాధించి షాద్నగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తూనే గ్రామాలతో పాటు పట్టణాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సాధించింది అన్నారు. గత పది ఏళ్ల పాలనలో జరిగిన తప్పిదాలు ఇప్పుడు ఉండబోవన్నారు. అభివృద్ధిలో నాణ్యతతో కూడిన పనులు, అవినీతి రహిత పాలన దిశగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో 250 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ కళాశాల, అదేవిధంగా స్టేడియం ల ఏర్పాటు, పట్టణ ముఖ్య కూడలి నుండి ఆరు కోట్ల రూపాయలతో పరిగి రోడ్డు ఆరు లైన్ల విస్తరణ పనులు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతిరోజు ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీని దీవించి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మున్సిపాలిటీ ఎన్నికలు ముగిసిన వెంటనే పట్టణ ముఖ్య కూడలి విస్తరణ పనులు ప్రారంభమవుతాయని ఈ సందర్భంగా తెలిపారు.

క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 24 : పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. చర్చిల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 10 లక్షల 80 వేల రూపాయల విలువైన చెక్కులను శనివారం సాయంత్రం ఆయా చర్చిల పాస్టర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల మూలంగా చెక్కుల పంపిణీ ఆలస్యం జరిగిందని తెలిపారు. రెండు విడతలలో మొత్తం 70 చర్చిలకు 21 లక్షల రూపాయలను అందచేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుండి మంజూరైన ప్రతి పైసాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మెప్మ డిపిఓ స్వాతి, సిఓలు రేఖా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

"

సాధారణ ప్రజలకు న్యాయం అందించడంలో హైకోర్టుల పాత్ర అత్యంత కీలకం. ఇవి ప్రాథమిక సంరక్షకులుగా నిలుస్తున్నాయి. న్యాయం ప్రజలకు దూరమైన భావన రాకుండా చేయడంలో వీటి పాత్ర ఎంతో ఉంది. హైకోర్టులు కేవలం అప్పీల్/రివిజన్ కోర్టులుగా కాకుండా, రాజ్యాంగ పరిరక్షణకు అందుబాటులో ఉండే కేంద్రాలుగా మారాలి. నేరుగా సుప్రీ కోర్టును ఆశ్రయించడాన్ని నేను వ్యతిరేకిస్తా.

\- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

ప్రాంతీయం

రామచంద్రపురం అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి
- రూ.5 కోట్ల రైతు బజార్, రూ.2.47 కోట్ల మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభం

ప్రతిపక్షం, సంగారెడ్డి, జనవరి 24 : సంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. శనివారం రామచంద్రపురం ప్రాంతంలోని భారతి నగర్ డివిజన్-111లో రూ.5 కోట్లతో నిర్మించిన రైతు బజార్‌ను, అలాగే బాంబే కాలనీలో రూ.2 కోట్ల 47 లక్షల వ్యయంతో నిర్మించిన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ... భారతి నగర్ రైతు బజార్ రైతులకు, వినియోగదారులకు అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైతులు నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.అనంతరం ఎంఐజి ప్రాంతంలో రూ.1 కోటి 20 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. రామచంద్రపురం ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో మేడారం కిటకిట

- ఒక్కరోజే 3లక్షల మంది భక్తులు

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, జనవరి 24: మేడారం భక్తులతో కిటకిటలాడుతోంది. జాతరకు సమయం దగ్గరపడడంతో.. భక్తులు ముందస్తుగానే చేరుకుని తమతమ మొక్కులను చెల్లించుకుంటున్నారు. దీంతో మేడారం కిటకిటలాడుతోంది. శనివారం ఒక్కరోజే 3 లక్షల మందికి పైగా భక్తులు విచ్చేసినట్లు అధికార వర్గాలు తెలుపుతున్నాయి. మహా జాతరకు మరో ఐదు రోజుల వ్యవధే ఉంది. ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున మేడారం తరలివస్తు న్నారు. మహా జాతరను తలపించేలా ప్రధాన కూడళ్లు, గద్దెలు, జంపన్నవాగు స్నాన ఘట్టాలు, తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, విడిది చేస్తే అటవీ ప్రాంతాల్లో భక్తజనంతో శనివారం రద్దీగా మారాయి. 3 లక్షల మందికి పైగా భక్తులు ప్రైవేటు, ఆర్టీసీ వాహనాల్లో తరలివచ్చారు. దీంతో రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తులతో మేడారం పరిసరాలన్నీ జనసంద్రంగా మారాయి. వనదేవతలకు మొక్కుల్లో భాగంగా భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా ఎత్తు బంగారం (బెల్లం) నెత్తిన మోస్తూ కాలినడకన దేవస్థానంలోని తల్లుల గద్దెలకు చేరుకున్నారు. ఆదివాసీల ఆచార సంప్రదాయాలలో చీరె, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, బెల్లం, ఒడిబియ్యం, యాట మొక్కులను చెల్లించుకుని తల్లీ సల్లంగా చూడు..మహా జాతరకు వస్తాం అని వేడుకున్నారు.

అవగాహనతో క్యాన్సర్ ముప్పు తప్పించవచ్చు

- ఆంకాలజిస్ట్ డాక్టర్ వంశీ చేతన

ప్రతిపక్షం, కరీంనగర్, జనవరి 24: ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండడం వల్ల ప్రాణాపాయం దుస్థితులను తప్పించి ఆరోగ్య సౌభాగ్యాలను కల్పించవచ్చని ప్రముఖ ఆంకాలజిస్టు డాక్టర్ వంశీ చేతన అన్నారు. శనివారం స్థానిక ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో లియో క్లబ్ ఆఫ్ ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన "క్యాన్సర్ అవగాహన కార్యక్రమం"లో ప్రముఖ వక్తగా హాజరై మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రపంచ మానవాళిని కబలింపజూస్తున్న నిశ్శబ్ద విపత్తు అని అంటూ, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులకు క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పొగాకు దురలవాటు, ఆల్కహాల్ సేవనం, ఫాస్ట్ ఫుడ్స్‌కు దూరంగా ఉంటూ శారీరక వ్యాయామం చేయడం, అధిక బరువును తగ్గించుకోవడం, ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మన శరీరంలో ఎలాంటి గడ్డలు ఏర్పడినా వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిదని సూచించారు. తొలి దశలో గుర్తించడం ద్వారా పూర్తి చికిత్స చేయవచ్చని భరోసా ఇచ్చారు. శరీరంలోని ఏ అవయవానికైనా క్యావన్సర్ వ్యాధి సోకవచ్చని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిథి లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 100 రకాలకు పైగా క్యాన్సర్ వ్యాధులు ఉన్నాయని, వీటిలో మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వస్తాయని, పురుషులకు నోటి క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సభాధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థినులకు క్యాలన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండడానికి ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసిన కళాశాల లియో క్లబ్బు సభ్యులను అభినందించారు. కార్యక్రమ అనంతరం డాక్టర్ చేతనను లియో సభ్యులు సముచితంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లియో క్లబ్ అధ్యక్షురాలు సహశ్రీ,, లియో అసీఫా, లియో తపస్విభూ, లియో శ్రీ విద్యలతో పాటు 150 మంది లియో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గజ్వేల్ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయం

- బీజేపీ రాష్ట్ర నాయకులు గురువారెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 24: రాబోయే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని, మున్సిపాలిటీలోని మొత్తం 20 వార్డుల్లో బిజెపి అభ్యర్థులే ఘనవిజయం సాధిస్తారని బిజెపి సీనియర్ నాయకులు దారం గురువారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గంలో అనేక అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో సాగించిన అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 420 దొంగ హామీలతో ప్రజలను వంచిస్తోందని, అమలుకు సాధ్యం కాని హామీలతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో చుక్కెదురవుతుందని, ఆ పార్టీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమన్నారు. రాష్ట్రంలో మరియు కేంద్రంలో బిజెపి పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయని, గజ్వేల్ గడ్డపై కచ్చితంగా బిజెపి జెండా ఎగురుతుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక బిజెపి నాయకులు కుడిక్యాల రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 24: సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పరేడ్ (మార్చ్ ఫాస్ట్), యోగా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలనే సదుద్దేశంతో పాటు ప్రతీ శనివారం ప్రత్యేక దుస్తుల్లో పాఠశాలకు హాజరు కావడం ద్వారా పాఠశాల వాతావరణం మరింత ఆకర్షణీయంగా ఉండాలనే లక్ష్యంతో పుల్లూరు గ్రామ ఉపసర్పంచ్ ఒగ్గు రాజేష్ తన సొంత ఖర్చులతో 120 మంది విద్యార్థులకు తెలుపు రంగు ట్రాక్ టీషర్ట్, ప్యాంట్ (వైట్ ట్రాక్ టీషర్ట్-లోయర్) పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు .ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, విద్యార్థుల అభివృద్ధికి సహకరిస్తున్న ఉపసర్పంచ్ ఒగ్గు రాజేష్ ని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ,ఉపాధ్యాయిని బృందంతో పాటు యూత్ సభ్యులు కృష్ణ, వైనాష్, సురేష్, యోగేష్, రాకేష్, అనిల్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు మహానంది జాతీయ అవార్డు గ్రహీత
డా.శ్రీనివాస్ నాయక్‌కు ఘన సన్మానం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 24: వెలుగు మహానంది జాతీయ అవార్డు పొందిన శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల నిపుణులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ గారిని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (TGLA711) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం , జిల్లా ప్రధాన కార్యదర్శి ధరిపల్లి.నగేష్ , జిల్లా కోశాధికారి కే.రాజు , రాష్ట్ర నాయకులు అశోక్ , డాక్టర్ మంగ్త నాయక్ , జిల్లా నాయకులు గంగాధర్ , పరశురాములు , యాదగిరి , బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ వైద్య రంగంలో అందించిన సేవలు, సాధించిన ప్రతిష్టాత్మక అవార్డు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు. ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. చివరగా డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తనకు లభించిన గౌరవానికి కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో మరింత సేవా భావంతో ప్రజలకు సేవలు అందిస్తానని అన్నారు.

భారత ఆధునిక వైతాళికులు
యువభారతానికి స్ఫూర్తి ప్రదాతలు

- వ్యక్తిత్వ వికాస నిపుణులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రతిపక్షం, కరీంనగర్, జనవరి 24: నేటి డిజిటల్ యుగపు భారతీయ యువతకు నిరంతరం స్ఫూర్తి ప్రదాతలు స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ లాంటి ఆధునిక వైతాళికుల జీవితాలు దారి దీపాలుగా నిలుస్తున్నారని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు స్థానిక సప్తగిరి హైస్కూల్ ప్రాంగణంలో ప్రజ్ఞాభారతి నిర్వహించిన "ఆధునిక భారత వైతాళికులు యువతకు స్ఫూర్తి ప్రదాతలు" అనబడే సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతి వెలిగించి మాట్లాడుతూ భారతీయ హృదయ స్పందనను పశ్చిమ దేశాలకు పరిచయం చేసిన స్వామీ వివేకానందుడు, భారత స్వాతంత్ర్యోద్యమంలో అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించి తన పరాక్రమాన్ని రుచి చూపిన బహుముఖ ప్రజ్ఞాశాలి నేతాజీ లాంటి మహానుభావులు మన యువ భారతానికి మార్గదర్శకులుగా వెలుగొందుతున్నారని తెలిపారు. ప్రతి వ్యక్తి జీవితంలో పాఠశాల విద్య పునాదిగా నిలుస్తుందని, ఈ దశలో విద్య, వివేకం, సంస్కారం, ఆకర్షణీయ వ్యక్తిత్వం, అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు తప్పనిసరిగా అవలర్చుకోవాలని సూచించారు. వివేకానందుడు, నేతాజీ లాంటి మహానుభావులు ఎక్కువ కాలం జీవించకపోయినా దేశ చరిత్రలో చెరగని ముద్ర వేశారని తెలిపారు. సభాధ్యక్షత వహించిన సముద్రాల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ నేటి యువత ఆధునిక వైతాళికుల సుసంపన్న జీవితాలను ప్రేరణగా చేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. ఈ సమావేశ సమన్వయకర్తలుగా పాఠశాల నిర్వాహకులు మందల నగేష్ రెడ్డి, అనిత రెడ్డిలు పాల్గొనగా గౌరవ అతిథులుగా ప్రజ్ఞాభారతి బాధ్యులు ఎలగందుల సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి, మురళిలు మాట్లాడి యువతకు మార్గదర్శనం చేశారు. పాఠశాల నిర్వహించిన దేశ భక్తి గీతాలాపన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు పాడిన పాటలు సభికులను అలరించాయి.

లేబర్ కోడ్స్ రద్దు కోసం ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె

- కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలి
- లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు తగిన గుణపాఠం చెప్తారు
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 24 : లేబర్ కోడ్స్ రద్దు కోసం ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు గుణపాఠం చెప్తారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, కిర్బి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అతిమేల మానిక్ అన్నారు.పాశమైలారం పారిశ్రామిక వాడలోని కిర్బి యాజమాన్యం కు ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మె నోటీస్ అందజేయడం జరిగింది అనంతరం జరిగిన యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో అతిమేల మాణిక్ మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ ను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కుల మీద తీవ్రమైన దాడి చేసిందని అన్నారు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసిందని అన్నారు చట్టాలు ఉన్నప్పుడే వాటిని అమలు చేయకుండా యాజమాన్యాలు ఇష్టానుసారంగా శ్రమదోపిడికి పాల్పడ్డాయని అన్నారు. లేబర్ కోడ్స్ తో కార్మికులు కట్టు బానిసలుగా మారే పరిస్థితి వచ్చిందని అన్నారు లేబర్ కోడ్స్ యాజమాన్యాల లాభాల కోసమే అని అన్నారు.. లేబర్ కోడ్స్ రద్దు కోసం కార్మికుల హక్కుల రక్షణ కోసం కనీస వేతనం 26,000 పెంచాలని, ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. యూనియన్ జనరల్ సెక్రెటరీ వివిఎస్ రాజు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధించుకోగలుగుతాం అని అన్నారు సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆఫీస్ బేరర్స్ తలారి శ్రీనివాస్ ఏడుకొండలు శంకర్ జైపాల్ సుధాకర్ శ్యామ్ బాబు మహేశ్వర్ రెడ్డి సుధాకర్ రెడ్డి రాజు రెడ్డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

"

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలను బహిరంగ వేదికలపై చర్చించబోను. రాజకీయ ప్రకటనలు చేయడానికి రాలేదు. సొంత పార్టీ నాయకులతో చర్చించాల్సిన సమస్యలపై పబ్లిక్‌లో మాట్లాడను. పార్లమెంట్ సమావేశాలకు ఢిల్లీ వెళ్లినప్పుడు పార్టీ నాయకులతో మాట్లాడే ఛాన్స్ వస్తుందని అనుకుంటున్నాను.
- కీలక సమావేశానికి గైర్హాజరుపై ఎంపీ శశి థరూర్

ప్రాంతీయం

రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఉమేష్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 24:

బహుజన సమాజ్ పార్టీ గజ్వేల్ మున్సిపాలిటీ సమీక్ష సమావేశం శనివారం స్థానిక అంబేద్కర్ భవన్ లో నియోజకవర్గ అధ్యక్షుడు కొమ్ము చంద్రం అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ళ నరేష్ హాజరై మాట్లాడుతూ గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వ్యతిరేక పార్టీలని వారు తెలిపారు. ప్రజలను కేవలం ఓట్లప్పుడు వాడుకొని మిగతా సందర్భంలో కనీసం పట్టించుకోని పార్టీలకు ఓటు వేయొద్దని ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే బీఎస్పీ పార్టీకి మాత్రమే ఓటు వేయాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైనా సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తిగా విఫలమైందని వారు మండిపడ్డారు . ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కనక ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శి శ్రీకాంత్ , బివిఎఫ్ కన్వీనర్ నాగరాజు, పరమేష్, అనిల్, మార్కుక్ మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు శ్రీశైలం, ఉదయ్, టోనీ బెక్కల్, ప్రసాద్ మౌర్య, మొండి కరుణాకర్, బాల్నర్సు, అనిల్, ప్రసాద్,భాను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ క్రీడలో గట్లమల్యాల విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్ర స్థాయి పోటీలలో రెండో స్థానం
- ఆడిన ప్రతి మ్యాచ్ లోనూ గెలిచి ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఫైనల్ కు చేర్చిన విద్యార్థులు

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 24:

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల్లో సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో రెండోస్థానం పొందారు. భారతీయ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 17 ఏళ్ల లోపు రాష్ట్ర స్థాయి 69 వ ఎస్జీఎఫ్ సాఫ్ట్ బాల్ పోటీలు ఈ నెల 21 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు నిజామాబాద్ లో జరిగాయి. ఈ పోటీలలో గట్లమల్యాల విద్యార్థులు బి.ఈశ్వరి, ఎం.వైష్ణవి, డి.అను, బి.హరిని ప్రియ, బి షణ్ముఖ ప్రియ, ఎస్.కిరణ్వి ఉమ్మడి మెదక్ జిల్లా తరపున ఆడారు. ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు మొత్తం అయిదు మ్యాచ్ లు ఆడింది. ఆడిన మ్యాచ్ లోనూ గట్లమల్యాల విద్యార్థులు చూపిన ప్రతిభ వల్ల విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్ విభాగంలో మహబూబ్ నగర్ పై మెదక్ జట్టు 90 తో విజయం సాధించి సెమీ ఫైనల్ కు చేరుకుంది. సెమీ ఫైనల్ లో ఆదిలాబాద్ పై 5 4 తేడాతో విజయం సాధించి ఫైనల్ కు చేరింది. ఫైనల్లో నిజామాబాద్ జట్టుతో తలపడింది. ఫైనల్ లో 61 తేడాతో రెండవ స్థానం దక్కించుకుంది. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన గట్లమల్యాల విద్యార్థులు బి.ఈశ్వరి, ఎం.వైష్ణవి, డి.అను, బి.హరిని ప్రియ, బి షణ్ముఖ ప్రియ, ఎస్.కిరణ్విలను, వీరికి సాఫ్టు బాల్ క్రీడలో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనాల రాజ్ కుమార్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదాసు రమేశ్, గ్రామ సర్పంచ్ ఇంగ నరేశ్, ఉప సర్పంచ్ తిప్పని శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బానోతు సరోజిని తదితరులు అభినందించారు.

హెల్మెట్ ధరించండి భద్రంగా ఇండ్లకు చేరండి

- బైక్ ర్యాలీ నిర్వహించిన పోలీసులు

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 24:

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాజగోపాలపేట పోలీసుల ఆధ్వర్యంలో శనివారం బైకు ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా అలైవ్ కార్యక్రమంలో భాగంగా బైక్ పై వెళ్లే వాహనదారులు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తూ రాజగోపాలపేట నుండి పాలమాకుల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ వాహనదారులు తమ భద్రత కోసం హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరారు.

వరికోలు ఉన్నత పాఠశాలలో

నమూనా గ్రామ సభ

- గ్రామ సమస్యలపై చిన్నారుల ప్రశ్నలు

ప్రతిపక్షం,కోహెడ, జనవరి, 24

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వరికోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నమూనా గ్రామసభను నిర్వహించారు. విద్యార్థులే గ్రామ సర్పంచి, ఉప సర్పంచి, వార్డు సభ్యులుగా వ్యవహరించారు. విద్యార్థులు గ్రామ పౌరులుగా వ్యవహరించి గ్రామ సమస్యలపై నిర్మాణాత్మకమైన చర్చను నిర్వహించి పలు అంశాలపై తీర్మానాలు ఆమోదించారు. సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన గ్రామసభ ఆద్యంతం ఆకట్టుకుంది. విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. అనంతరం ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచిగా ఎన్నికైన గ్రామ సర్పంచి సుదగోని దేవరాజు, ఉప సర్పంచి కృష్ణారెడ్డి, ఇతర వార్డు సభ్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, ఉప్పల్ రెడ్డి, ప్రభాకర్, సంగు రామకృష్ణ, ఉపేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కార్డు ద్వారా మాత్రమే

యూరియా పంపిణీ చేయాలి

- ఏ డీ ఏ పద్మ

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 24:

రైతులకు యూరియా కార్డు ద్వారా మాత్రమే యూరియాను పంపిణీ చేయాలని ఎరువుల దుకాణాదారులకు సిద్దిపేట ఏ డి ఏ పద్మ స్పష్టం చేశారు. నంగునూరులోని ఎరువుల దుకాణాల్లో సిద్దిపేట ఏ డీ ఏ పద్మ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలువురు రైతులతో మాట్లాడుతూ రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ రైతులందరూ తప్పకుండా చేసుకోవాలని సూచించారు. దీనివల్ల వ్యవసాయ సంబంధిత పథకాల అమలులో ఇబ్బంది లేకుండా రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉపయోగపడుతుందని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు రాయితీలో అందుబాటులో ఉన్నాయన్నారు.రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి బి.గీత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన పంటలకు ప్రకృతి వ్యవసాయం అవసరం

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 24:

తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలు పండించేందుకు ప్రకృతి వ్యవసాయం ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై 5 రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొని కృషిసఖిలకు చెందిన మహిళా రైతులకు ధృవపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం రైతులకు తక్కువ ఖర్చుతో, ఆరోగ్యకరమైన పంటలను పండించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో జీవామృతం, బీజామృతం, దశపర్ణి కషాయం, ఐదు పొరల సాగు నమూనా, వామ్, ట్రైకోడెర్మా తయారీ విధానాలపై కృషిసఖిలకు సమగ్ర శిక్షణ అందించామని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ అధికారి మైథిలి, కృషిసఖిలు, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు తిరుపతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

ప్రతిపక్షం మంచిర్యాల జనవరి 24

మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర రావు రైతులకు సబ్బు మిషన్ ఆన్ అగ్రికల్చర్ మేకనైజేషన్ లో భాగంగా సబ్సిడీ పైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం సబ్సిడీ పైన ఇస్తున్న వ్యవసాయ పరికరాలను వినియోగించు కోవాలని కోరారు కార్యక్రమంలో మంచిర్యాల ఏఎంసి చైర్మన్ పయ్యావుల పద్మముని బి ఎఫ్ ఎ సి చైర్మన్ సింగతి మురళి మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారిని శ్రీమతి సురేఖ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం కృష్ణ నియోజకవర్గ మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు ఆరు పవర్ టిల్లర్లు ఆరు రోటవేటర్లు 52 పవర్ స్ప్రేయర్లు 16 బ్రష్ కట్టర్లు మొత్తం 82 పరికరాలు 16 లక్షల 24 వేల సబ్సిడీ పైన ఇవ్వడం జరిగింది.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 24: ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కార్మికులకి పిలుపునిచ్చారు.శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కార్మిక కర్షక భవనంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి చుక్కా రాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ 12 సంవత్సరాల కాలంలో కార్మిక వర్గానికి చేసిన మేలు ఏమి లేకపోగా ఎన్నో సంవత్సరాలుగా పోరాడు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 2021లో పార్లమెంట్ లో ఉన్న తన అధికార బలంతో చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కార్మిక వర్గానికి నష్టం చేసే యాజమాన్యాలకు కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్ లను తెచ్చిందన్నారు. ఎలాంటి హక్కులు లేని ఈ కోడ్ లను 2025 నవంబర్ ఒకటో తేదీ నుండి నోటిఫికేషన్ విడుదల చేస్తూ రాష్ట్రాలు తక్షణమే లేబర్ కోడులను అమలు చేయాలని ఉకుంజారి చేసిందనీ,ఇప్పటివరకు అమలులో ఉన్న ఎనిమిది గంటల పని విధానానికి స్వస్తి పలికి 12 గంటల పని విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. 1942 ట్రేడ్ యూనియన్ చట్టం ఉంటే కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకొని వారి హక్కుల కోసం నిలదీసేటువంటి ప్రశ్నించేటువంటి హక్కు ఉండేదన్నారు.కానీ ప్రతి పరిశ్రమలో యూనియన్ ఏర్పాటు చేసుకోవాలంటే ఈరోజు అనేక షరతులు పెట్టి యూనియన్ ఏర్పాటు చేసుకోకుండా కోడులో సవరణ చేశారు. ప్రతి కార్మికుడికి శ్రమకు తగ్గ ఫలితం కనీస వేతనం 18 వేల నుండి 26 వేల వరకు ఉండాలని పోరాడుతుంటే మినిమం వేజ్ కోడ్ లో కనీస వేతనాలని రోజుకు 176 రూపాయలు మాత్రమే నెలకు 4756 వచ్చే విధంగా మార్పు చేశారని దీని ఫలితంగా కార్మిక వర్గం శ్రమ దోపిడీకి గురవుతారని వారు అన్నారు. శాశ్వత పనికి శాశ్వత ఉపాధి ఉండే అవకాశాన్ని వాటి స్థానంలో ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ విధానాన్ని తీసుకువచ్చిందని దీని ఫలితంగా యజమాని దయాద్రాక్షాన్యాల మీద మాత్రమే ఆధారపడి పని చేయాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు .పిఎఫ్ ఈఎస్ఐ లాంటి సామాజిక భద్రత కోడ్లో కూడా ఎలాంటి సౌకర్యాలు లేవని చెప్పారు.కానీ నేడు దీనికి భిన్నంగా కార్పొరేట్ మీడియా లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే అద్భుతాలు జరుగుతాయని బిజెపి భజన మండలి చెప్తున్నాయి.కానీ వాస్తవానికి కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకి కార్పొరేట్ శక్తులకి కట్టు బానిసలుగా మార్చడానికి మాత్రమే ఈ లేబర్ కోడు అమల్లోకి వస్తున్నాయని వేటిని అడ్డుకోవడం కోసం కార్మిక వర్గం ఐక్యతతో విశాల ఉద్యమాలు నిర్మించడానికి దాని రుచి చూపించడానికి ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం చేపడుతుందని ఈ సమ్మెను కార్మిక వర్గం తన భుజస్కందాలపై వేసుకొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి గొడ్డు బర్ల భాస్కర్, ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి అమ్ముల బాల్ నరసయ్య జిల్లా సహాయ కార్యదర్శిలు చొప్పరి రవికుమార్, మామిడాల కనకయ్య, ఇప్పకాయల శోభ తదితరులు పాల్గొన్నారు

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ఉత్తరాలు

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 24

రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అన్ని రంగాలలో బీసీలకు రావాల్సిన వాటాలను ఎన్నికల ముందు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం బిసి సమాజ్ నాయకులు సీఎంకు ఉత్తరాల ద్వారా తెలియజేశారు సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఎండ తరబడి బిసి కులస్తులకు అన్యాయం జరుగుతూనే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు చట్టసభల్లో బీసీలకు న్యాయం చేకూరే విధంగా చట్టాలను రూపొందించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ నాయకులు గుమ్మల శ్రీనివాస్ గజల్ వెంకటయ్య వేముల అశోక్ భీమ్సేన్ చారి తదితరులు పాల్గొన్నారు

26 నుంచి మహామ్మాయి దేవాలయ 126 వార్షిక బ్రహోత్సవాలు

- 13 రోజుల పాటు శత చండీ యాగం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 24:

శ్రీ శ్రీ శ్రీ మహామ్మాయి దేవాలయం 126 వార్షిక బ్రహోత్సవాలు జనవరి 26 వ తేది నుంచి ఫిబ్రవరి 7 వ తేది వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు జిల్లా స్వర్ణకార సంఘం కన్వీనర్, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, ఆలయ అర్చకుడు శంకరా చారి తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ మహమ్మాయి దేవాలయంలో శ్రీ మహామ్మాయి దేవి ఆలయ కమిటీ, బులియన్ మర్చంట్, పట్టణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు వార్షిక బ్రహోత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉత్సవాల్లో భాగంగా 13 రోజుల పాటు ఉదయం శత చండీ యాగం, సాయంత్రం 108 మంది ముత్తైదువులతో కోటి లలితా పారాయణయు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా 26న గ్రామ దేవతల పూజలు, 27న సుప్రభాత సేవ, ధ్వజారోహనం, గోపూజ, యాగశాల ప్రవేశం, సర్వ మంటపదేవతా ఆవాహనలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న లక్ష గరిక పూజ, లక్ష ఉండ్రాల నివేదన పూజ, 29న శ్రీ మేధా దక్షిణ మూర్తి పూజ, లక్ష పుష్పార్చన, సరస్వతీ పూజ, 30న కుంకుమార్చనలు, సహస్ర కమలార్చన, 31న లక్ష తులసీదలార్చన, నాగవల్లి దళార్చన, మహా దీపోత్సవం, ఫిబ్రవరి 1వ తేదిన శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, పల్లకి సేవా, 2న మహా లింగార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, మహా బిల్వార్చన, 3న లక్ష గౌరమ్మల పూజ, 11 వేల ఒక వంద పదహారు గాజుల చేత, మరియు 9 వేల పసుపు కొమ్ముల చేత శ్రీ మహమ్మాయమ్మ దేవికి విశేష పూజ, 4న అష్టోత్తర శత కలశాభిశేకం, 5న అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాల చేత మహాభిషేకం, 6న మహా పూర్ణాహుతి, సుహాసిని, కుమారి పూజ, 7న రథోత్సవము, కోమటి చెరువులో చక్రస్నానం, మహా సంప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, రాత్రి అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం వెంకట నర్సయ్య, కిష్టపురం ప్రభాకర్, కల్లెపల్లి మహేష్, మోహన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధిలో మంచిర్యాల బెస్ట్

ప్రతిపక్షం, మంచిర్యాల జనవరి 24



రాష్ట్రంలో మంచిర్యాల అభివృద్ధిలో ముందు వరుసలో ఉందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో పద్మనాయక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నుండి ఎన్నడు లేని విధంగా తమ హాయంలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు గతంలో పేరు ఎమ్మెల్యేలు చేయని అభివృద్ధి తమ హాయంలో చేశానని పేర్కొన్నారు రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో 60 స్థానాలకు 60 తమ పార్టీ గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు అనంతరం టిఆర్ఎస్ పార్టీ నుండి సుమారు 200 మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గం. ప్రజాస్వామ్య పద్ధతిలో దర్యాప్తు జరుగుతోంది. కేటీఆర్‌ను నేరస్థుడిగా పరిగణించలేదు. సాక్షిగా సమాచారం కోసమే విచారణకు పిలిచారు. ప్రభుత్వానిది రాజకీయ కక్ష అనడం సరికాదు. కేసులో పాత్రధారులు, సూత్రధారులు తేలాలి. దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తాం.

- మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రాంతీయం

స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలి.
- జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం.నగేష్



ప్రతిపక్షం,మెదక్ టౌన్ ,జనవరి 24

గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బి, ఎస్ఐ , కానిస్టేబుల్, ఎస్ ఎస్ సి తదితర పోటీ పరీక్షలకు స్థానిక టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఫౌండేషన్ కోర్సు ద్వారా 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ యం . నగేష్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సింధు,స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శ్రీకాంత్ లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు.ఈ నెల 30 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్ లో tsstudycercle. co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 8 న సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎంట్రన్స్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా,మెరిట్ ఆదరంగా ఎస్సీలకు 75,బీసీ లకు 15 ,ఎస్టీ లకు 10శాతం సీట్లు కేటాయిస్తారని చెప్పారు. ఇందులో ఫిజికల్ హ్యాండీక్యాప్ అభ్యర్థులకు 5, మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సాగు నీళ్ల కోసం రైతుల ఎదురుచూపులు..

- వరి నాట్లు వేసిన రైతులకు న్యాయం చేయాలి
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీష్ రావు లేఖ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 24:

యాసంగి పంటకు నీళ్లు వస్తాయా రావా అన్న ఆందోళనలో ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగం ఉంది. ఇప్పటికే వరి నాట్లు వేసిన రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేసి న్యాయం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా రైతుల తరఫున రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీష్ రావు లేఖ రాశారు. ఆ లేఖలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఉమ్మడి జిల్లాకు సాగు, త్రాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ల నిర్మాణంతో గత ఆరు సంవత్సరాలుగా గోదావరి జలాలను ఉమ్మడి మెదక్ జిల్లా రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ నాలుగు ప్రాజెక్టుల ద్వారా సిద్ధిపేట, మెదక్, యాదాద్రి, జనగామ, సిరిసిల్ల జిల్లాలకు సాగు, త్రాగునీరు అందించబడిందని పేర్కొన్నారు.గత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం జలాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి సుమారు 3 లక్షల ఎకరాల్లో పంటలు పండాయని గుర్తు చేస్తూ, ఈ సంవత్సరం కూడా అదే విధంగా సాగునీరు అందించేందుకు నీటి ప్రణాళిక కమిటీని ఆదేశించాలని కోరారు. ఇప్పటికే రైతులు నాట్లు వేసుకుని నీళ్ల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాలువల ద్వారా పంట పొలాలకు నీరు విడుదల చేయడంతో పాటు, గతంలో మాదిరిగా చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు కూడా నీరు విడుదల చేసి భూగర్భ జలాల పెంపుకు చర్యలు తీసుకోవాలని లేఖలో సూచించారు.ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, ప్రభుత్వం తరఫున ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగానికి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు గట్టిగా డిమాండ్ చేశారు.

ఓటు హక్కు వినియోగమే ప్రజాస్వామ్యానికి ప్రాణం

- ప్రొఫెసర్ కె హుస్సేన్ .

ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 24

ఓటు హక్కు వినియోగమే ప్రజాస్వామ్యానికి ప్రాణం అని ప్రొఫెసర్ కె హుస్సేన్ అన్నారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా ప్రొఫెసర్ కళాశాల ప్రిన్సిపాల్ కె హుస్సేన్ మాట్లాడుతూ..ఓటు హక్కు ప్రజాస్వామ్యాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తుందో విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు,అధ్యాపకులతో కలసి ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలనశాస్త్ర విభాగాధిపతి పి సురేంద్రరావు, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డా. టీ మల్లేశం, చరిత్ర శాస్త్ర విభాగాధిపతి కే. వెంకటేశ్వర్లు, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి రాజా గౌడ్, తెలుగు అధ్యాపకులు డా. రాగుల సుధాకర్,రాజకీయ శాస్త్ర అధ్యాపకులు యల్. యాదగిరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్య అనేది బాలికలకు అత్యంత శక్తివంతమైన ఆయుధం

- విద్యతోనే బాలికల బంగారు భవిష్యత్తు.
- అదనపు ఎస్పీ మహేందర్.
- మెదక్‌లో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు.

ప్రతిపక్షం,మెదక్ టౌన్,జనవరి 24

విద్య అనేది బాలికలకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు.జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెదక్ రెసిడెన్షియల్ స్కూల్ & కాలేజీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ...నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ ముందంజలో ఉన్నారని తెలిపారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ప్రతిభతో పాటు ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు.విద్య అనేది బాలికలకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, అది భవిష్యత్తును మార్చే శక్తిని ఇస్తుందని అన్నారు. బాలికల రక్షణ, భద్రత అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించిన ఆయన,అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకూడదని, ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.జిల్లాలో షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతూ మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేస్తున్నాయని, అవసరమైన సందర్భాల్లో వెంటనే 100 డయల్ చేయాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు.ఈ సందర్భంగా 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల తల్లిదండ్రులను సత్కరించి, నాటకాలు, క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. అనంతరం బాలికల రక్షణ, విద్య, అభివృద్ధి కోసం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ విజయ, డీడబ్ల్యూఓ హేమ భార్గవి, ప్రిన్సిపాల్ తార సింగ్ , భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేత, సీడీపీఓ వెంకటరమణమ్మ, ఐసీపీయస్ కోఆర్డినేటర్ రాహుల్, తల్లిదండ్రులు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన గంజాయి స్మగ్లర్లు

- ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన స్మగ్లర్లు
- తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరిన కానిస్టేబుల్
- పరామర్శించిన కలెక్టర్
- పోలీసుల అదుపులో స్మగ్లర్లు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 24:

కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో కారును ఆపబోయిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ను స్మగ్లర్లను అదే కారుతో ఢీకొట్టి పారిపోయేందుకు ప్రయత్నించి పట్టుబడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయలపాలైన కానిస్టేబుల్ ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ నుంచి నిజామాబాద్ మీదుగా ఓ కారులో ఎండు గంజాయి అక్రమంగా తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారంలో నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ స్వప్న తన సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ నగర శివారు మాధవనగర్ వద్ద రూట్ వాచ్ తనిఖీలు చేపట్టారు. ఆ సమంయలో అనుమానాస్పదంగా వస్తున్న ఓ కారును ఆపేందుకు ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ప్రయత్నించింది. దాంతో స్మగ్లర్లు అక్కడినుంచి తప్పించుకునేందుకు కారు డ్రైవర్ వేగంగా వాహనాన్నిఆమె పైకి పోనిచ్చి బలంగా ఢీ కొట్టడంతో స్వామ్య రోడ్డుపై పడిపోగా అప్రమత్తమైన తోటి సిబ్బంది స్మగ్లర్లను వెంబండించి కారులో ఉన్న మహమ్మద్ సోఫియోద్దీన్ సయ్యద్ షోయబ్లను పట్టుకున్నారు. తీవ్రగాయాలైన సౌమ్యను తోటి సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం సౌమ్య పొట్ట భాగంలో అతర్గత గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. కాగా కారులో రెండు కిలోల గంజాయిను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

సీఐ స్వప్న తీరుపై ఎక్సైజ్ ఉద్యోగుల ఆందోళన...

ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పై గంజాయి ముఠా దాడి కేసులో కొత్త మలుపు చోటుచేసుకుంది. ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ కు న్యాయం చేయాలని ఉద్యోగులు విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన వెనుక ఎక్సైజ్ సీఐ స్వప్న, కానిస్టేబుల్ హమీద్ల ప్రమేయం ఉందని ఉద్యోగులు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కేసుల విషయంలో కిందిస్థాయి ఉద్యోగులను వేదిస్తున్నారని ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవి అన్నారు. తమకు పదోన్నతుల కొరకు కిందిస్థాయి ఉద్యోగులను బలి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో అసలు గంజాయి రవాణా లేకున్నా పక్క జిల్లా కేసుల చేదనలో ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ స్వప్న, కానిస్టేబుల్ హమీద్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాంతో ఉన్నతాధికారులు సోమిరెడ్డి, మల్లారెడ్డిలు ఉద్యోగులకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. ఎస్సైజ్ సీఐ ప్రమేయంపై కమిటీ ఏర్పాటు చేస్తానని డిప్యూటీ కమిషనర్ హామీ ఇవ్వడంతో ఉద్యోగులు ఆందోళన విరమించారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ ను పరామర్శించిన కలెక్టర్

నిజామాబాద్ నగర శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులు కారుతో ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ జి.సౌమ్యను కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి ఆసుపత్రి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సౌమ్య కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. సౌమ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.విధి నిర్వహణలో ఉన్న ఎక్సైజ్ వుమెన్ కానిస్టేబుల్ పై హత్యా యత్నానికి పాల్పడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులైన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీస్ కమిషనర్ ను కోరతామని అన్నారు. సౌమ్య వెంటిలేటర్ పై ఉన్నారని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ 48 గంటల పాటు అబ్జర్వేషన్ లో ఉంచాలని వైద్యులు తెలిపారని కలెక్టర్ వెల్లడించారు. సౌమ్య ఆరోగ్యం సహకరించిన వెంటనే ఉన్నత స్థాయి వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించేలా ఏర్పాట్లు చేశామని, ఆమె వైద్యం కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వ పరంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కాగా, సంఘటన జరిగిన వెంటనే ఘటనా స్థలంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వప్న తక్షణమే స్పందించి సౌమ్యకు సీ.పీ.ఆర్ చేయడం ఎంతగానో ఉపకరించిందని ఈ సందర్భంగా స్వప్నను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణలో స్వీయ భద్రత పాటించాలి

కాగా, ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు అందరూ విధి నిర్వహణ సమయంలో స్వీయ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అభివృద్ధి పనుల ప్రగతి పై కలెక్టరేట్ లో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఘటనను ప్రస్తావించారు. విధి నిర్వహణలో ఉన్న తరుణంలో హత్యా యత్నానికి గురై తీవ్రంగా గాయపడిన సౌమ్య ఘటన తనను ఎంతగానో కలిచివేసిందని అన్నారు. విధులు నిర్వర్తించే సమయాలలో ఉద్యోగులు అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కస్తూరిభా గాంధీ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 24

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా వేలేరు మండలం గొల్లకిష్టంపల్లి కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.1.28 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ఎదిగి అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బాలికలు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలని అన్నారు. బాలికల విద్యకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, బాలికల విద్య, భద్రత, ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బాలికలు తమ కాళ్లపై తాము నిలబడి తల్లిదండ్రులకు గర్వకారణం కావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, పాఠశాలలోని సైన్స్ ఎగ్జిబిషన్‌లు, ఇతర ప్రదర్శనలను పరిశీలించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో గిరిరాజ్ గౌడ్, తహసీల్దార్, ఎంపీడీవో, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు రూ.5 లక్షల రుణమాఫీ..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట,జనవరి24:

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత ఋణ మాఫీ పథకం కింద సిద్దిపేట జిల్లాలోని చేనేత కార్మికులకు రుణమాఫీ జరిగింది. చేనేత కార్మికులు తమ వృత్తికి సం బం ధిం చి న మూలధన అవసరాల కోసం వివిధ బ్యాంకుల ద్వారా 1 ఏప్రిల్ 2017 నుంచి 31 మార్చి 2024 వరకు తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది.ఈ పథకం కింద సిద్దిపేట జిల్లాలో మొత్తం 7 మంది చేనేత కార్మికులకు రూ.5.00 లక్షల నిధులు మంజూరు చేసి, వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చేనేత,జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఎం. సాగర్ తెలిపారు. ఈ రుణమాఫీ ద్వారా చేనేత కార్మికులకు ఆర్థిక ఊరట కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ద్వాపర యుగంలో భక్త రామదాసు, నేడు రామకోటి

- గజ్వేల్ ఏసీపీ నర్సింలు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 24:

భద్రాచల రామదాసు 393వ జయంతోత్సవాలు ఈ నెల 27వ తేదీ వరకు భద్రాచల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతాయని వీటికి సంబందించిన శుభ ఆహ్వాన పత్రికలను శనివారం శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, రామకోటి సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సింలు మాట్లాడుతూ రామనామం అమోఘమైనదన్నారు. ఎన్నో కష్టాలను అనుభవించి భద్రాచలంలో సీతారాములకు ఆలయం నిర్మించి చరిత్రలో నిలిచిపోయిన గొప్ప భక్తుడు భక్తరామదాసే అన్నారు. నేను మరో రామదాసుగా రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక కృషి, పట్టుదల అమోఘం అని కొనియాడారు. అనంతరం సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు మాట్లాడుతూ భద్రాచలంలో జరిగే ప్రతి పుణ్య కార్యక్రమం లో రామరాజు మనందరిని బాగా స్వాములవడం గొప్ప కార్యం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దారం గురువారెడ్డి, మెతుకు నర్సింలు, బీజేపీ జిల్లా ఉపాధ్యాయులు కుడిక్యాల రాములు, దూస మహేష్, నాగేదర్ పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 24:

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల ప్రార్థనలు, ఉపవాసాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో రంజాన్ ఏర్పాట్లపై చర్చించారు. ఫిబ్రవరి 18 నుంచి మార్చి 19 వరకు రంజాన్ మాసం కొనసాగుతుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మసీదులు, ఈద్గాల వద్ద పారిశుద్ధ్యం, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, లైటింగ్, రహదారి మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, గ్యాస్ సిలిండర్ల సరఫరా, వీధి కుక్కల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రంజాన్ మాస ఏర్పాట్లు విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ కుశాల్కర్, డీఆర్ఓ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నాగరాజమ్మ, ఆర్డీఓ సదానందం, ఇతర శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సీపీని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 24:

సిద్దిపేటకు నూతనంగా విచ్చేసిన కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్‌ను సిద్దిపేట టీఎన్జీవోస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, భద్రత, ఆరోగ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని సీపీ తెలిపారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, రాత్రి వేళ కలెక్టరేట్ నుంచి పొన్నాల క్రాసింగ్ వరకు పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు అవసరమైతే అదనపు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రం రెడ్డి, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు నీలకంఠ మఠం నగేష్, కార్యదర్శి చెవిటి సుమన్, మహిళా ఉపాధ్యక్షురాలు విఠల్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రానికి అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుంది. ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థలను ప్రక్షాళన చేశాం. చెడు ఆలోచనలతో నేరస్థులు రాజకీయాలు చేస్తే ఏమవుతుందో చూశాం. పద్ధతి లేని రాజకీయాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు

- నగరి ప్రజావేదికలో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

దేశ భవిష్యత్తుకు పునాది బాలికలు

- బాలికల చదువు కోసం వారి అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 24 :

దేశ అభివృద్ధికి పునాది బాలికలని, బాలికల చదువు కోసం వారి అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో ఉమెన్, చిల్డ్రన్, డిజబుల్డ్, సీనియర్ సిటిజన్ శాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్బన్

ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలికలపై దాడులు లేని సమాజాన్ని సాధించుకుందామని, వారికి ఉన్న హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆడపిల్లలను సంరక్షించుకుందాం వారికి మంచి జీవితాలను ఇద్దామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బాలికలు అంటే భవిష్యత్ తరాలకు పునాది అని ఆయన అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం బేటి బచావో బేటి పడావో పథకం ద్వారా బాలికల సంరక్షణ, విద్యకు పెద్ద పీట వేస్తుందని అలాగే బాలికల భవిష్యత్తు భద్రత కోసం సుకన్య సమృద్ధి యోజన, పోషకాహారం కోసం పీఎం పోషణ్ పథకం, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్య కోసం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పదోతరగతి తర్వాత చదువు కొనసాగించేందుకు జాతీయ బాలికల విద్య ప్రోత్సాహక పథకం వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. బాలికలు చదువుకుంటే ఒక కుటుంబమే కాదని ఒక తరానికి మార్గం నిర్దేశకం అవుతారని ఆయన అన్నారు. దయచేసి బాలికల తల్లిదండ్రులు వారి చదువుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరిని చదివించాలని తల్లిదండ్రులకు ఎమ్మెల్యే గారు విజ్ఞప్తి చేశారు. అప్పుడే ప్రతి ఒక్కరు అభివృద్ధి పథానా నడుస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ పద్మలత , డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బి గారు, డిస్టిక్ స్పోర్ట్స్ ఆఫీసర్ పవన్ కుమార్ గారు, సిడిపిఓలు సౌందర్య, పద్మ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి అభివృద్ధియే ధ్యేయం

- రూ. 65.80 కోట్లతో అమృత్ 2.0 పనులకు షబ్బీర్ అలీ శంకుస్థాపన

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 24:

కామారెడ్డి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. కామారెడ్డి పట్టణంలో అమృత్ 2.0 (AMRUT 2.0) పథకం కింద రూ. 65 కోట్ల 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు.తాగునీటి సౌకర్యం కోసం భారీ కేటాయింపులు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు నాలుగు నూతన భారీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇస్లాంపుర కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు), లిటిల్ స్కాలర్ స్కూల్ ప్రాంతం: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.03 కోట్లు), గ్రీన్ సిటీ కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు), డ్రైవర్స్ కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు),వీటితో పాటు పట్టణంలోని వికాస్ నగర్ మరియు లింగాపూర్ వార్డులలో సిసి రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అభివృద్ధే చరిత్రలో నిలుస్తుందన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి.. మనుషులు కూడా శాశ్వతం కాదని, కానీ మనం చేసే అభివృద్ధి పనులు మాత్రమే కలకాలం నిలిచిపోతాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి పని చేసినప్పుడే మన పేరు చరిత్ర పుటల్లో నిలుస్తుందన్నారు.రాజకీయం అనేది నీతిగా, నిజాయితీగా ఉండాలని, ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకోవడమే అసలైన విజయమని ఆయన పేర్కొన్నారు.నేను ఎప్పుడూ కుల మత రాజకీయాలకు దూరంగా ఉంటాను. అభివృద్ధి విషయంలో వివక్షకు తావు లేదని, అందరికీ సమానమైన ఫలాలు అందాలన్నదే నా ఆకాంక్ష" అని స్పష్టం చేశారు. అభివృద్ధే నా గుర్తింపు అని, కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, కేవలం మాటలతో కాకుండా పనులతోనే ప్రజల మెప్పు పొందుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 24: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వార్డులను సందర్శించి అక్కడి సౌకర్యాలు, రోగులకు అందుతున్న వైద్య సేవల పై వివరాలు ఆరా తీసి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, భోజనం, ఇతర సౌకర్యాల పై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీ లో ఆర్డీవో వీణ, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు

ప్రజోపయోగ పనులకు అనువైన స్థలాలను గుర్తించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 24 : ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనుల నిర్మాణాల కోసం అనువైన భూముల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు, కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, నర్సింగ్ స్కూల్/కాలేజీలు, అంగన్వాడి కేంద్రాలు, గ్రంథాలయాలు తదితర వాటికి సొంత భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వ అనుమతి లభించినందున, అనువైన స్థలాలను తక్షణమే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే స్థల నిర్ధారణ పూర్తయిన చోట వెంటనే పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు స్థల సమస్య కారణంగా ల్యాప్స్ కాకూడదని అన్నారు. ఆయా భవనాల నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకవేళ ఎక్కడైనా ఈ స్థలాలు కబ్జాకు గురైతే అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. కాగా, నిజామాబాద్ నగరం, బోధన్ వంటి పట్టణాలలో అభివృద్ధి పనులకు తగిన స్థలాలు అందుబాటులో లేకపోతే సమీప మండలాల్లో అనువైన భూములను గుర్తించాలని అన్నారు. ప్రజోపయోగ పనులకు స్థల సేకరణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, మంజూరీలు లభించిన అన్ని భవనాల నిర్మాణాల కోసం తగిన స్థలాన్ని గుర్తిస్తూ కేటాయింపులు చేయాలని తహసిల్దార్లకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం

- సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం
- సర్పంచ్ భవాని నవీన్ కుమార్

ప్రతిపక్షం,చిన్నకోడూరు, జనవరి 24:

విద్యాభివృద్ధితో పాటు పాఠశాల సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ పాలకవర్గం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని సర్పంచ్ ఎర్ర భవాని నవీన్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో గ్రామపంచాయతీ నూతన పాలక వర్గం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి విద్యార్థులు చక్కగా చదువుకోవాలని అన్నారు. ప్రతిరోజు బడికి వచ్చి ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని, ఎప్పటికప్పుడు హోం వర్క్ పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో ఏ సమస్యలున్న తమ దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఉపాధ్యాయుల కృషికి తన సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఉపాధ్యాయ బృందం సన్మానించింది. ప్రధానోపాధ్యాయుడు యాంసాని వెంకట కుమార్ మాట్లాడుతూ గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా పంచాయతీ పాలక వర్గం చూడాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి క్రమశిక్షణ అలవర్చుతామని చెప్పారు. పాఠశాల పటిష్ఠతకు సహకారం అందించాలని కోరారు. గ్రామంలోని పాఠశాలను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గం అందరితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ ప్రేమలత, ఉప సర్పంచ్ పావని తిరుపతిరెడ్డి, సభ్యులు సురేందర్ రెడ్డి, రాజేందర్, కనకయ్య, పరశురాములు, రాజు, కనకరాజు, భారతవ్వ, రమ, సంతోష, సుమలత, ఉపాధ్యాయులు సునీత, ఆబేద బేగం, నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూర్చాలి

- జిల్లా జడ్జి జీ.వీ.ఎన్.భరతలక్ష్మి
- కలెక్టర్ తో కలిసి ప్రత్యేక సదరం శిబిరంను ప్రారంభించిన జిల్లా జడ్జి

నిజామాబాద్, జనవరి 24 :

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పూర్తి స్థాయిలో లబ్ది చేకూరేలా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని జిల్లా జడ్జి జీ.వీ.ఎన్. భరతలక్ష్మి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చొరవతో డీఆర్డీఏ, సెర్ప్, విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో శనివారం ప్రత్యేక అవసరాల బాలబాలికల కోసం సదరం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి జిల్లా జడ్జి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, దివ్యాంగులైన తమ పిల్లలకు సదరం సర్టిఫికెట్లు, ఆసరా పెన్షన్లను ఇప్పించాలని పలువురు తనను కలిసి కోరడం జరిగిందన్నారు. దీంతో సంబంధిత అధికారులను సంప్రదించి, జిల్లా కలెక్టర్ తోడ్పాటుతో ఈ ప్రత్యేక సదరం శిబిరాన్ని ఏర్పాటు చేయించామని తెలిపారు. దివ్యాంగులైన పిల్లలు వారికి ఏం కావాలి అన్నది అడగలేని పరిస్థితి

లో ఉంటారని, వారి అవసరాలను సంబంధిత అధికారులే గుర్తించి సహకారం అందించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారి కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వారు పూర్తిస్థాయిలో లబ్ది పొందేలా చొరవ చూపాల్సిన గురుతర బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. భవిత కేంద్రాలలో కనీస సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు ప్రతి వారం సదరం శిబిరం నిర్వహిస్తూ సర్టిఫికెట్లు జారీ చేస్తారని, అర్హులైన వారికి పెన్షన్ అందిస్తారని, ఈ విషయాన్ని తోటి వారికి తెలియజేయాలని దివ్యాంగుల తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయకపోతే, సరైన విధంగా సేవలు అందించకపోతే జిల్లా అధికారులకు తెలుపాలని, సరైన స్పందన రాకపోతే జిల్లా న్యాయసేవా సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఈ శిబిరాలలో సదరం సర్టిఫికెట్లు ఇప్పించిన అనంతరం, అర్హులైన వారికి త్వరితగతిన ఆసరా పెన్షన్లు మంజూరయ్యేలా జిల్లా యంత్రాంగం తరపున చొరవ చూపుతామని అన్నారు. ఈ మేరకు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని దివ్యాంగులైన పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ప్రభుత్వం తగిన సదుపాయాలతో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కేంద్రాలలో సాధారణ పిల్లలతో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలు మమేకమై వైకల్యం బారి నుండి క్రమక్రమంగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. భవిత కేంద్రాలలో పిల్లలకు పూర్తి స్థాయిలో సదుపాయాలు అందుబాటులో ఉంచుతూ, వారికి అవసరమైన స్పీచ్ థెరపి, ఫిజియోథెరపి వంటివి అందించాలని రిసోర్స్ పర్సన్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయాగౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ వైద్య కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి కృషి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 24 :

బాలికల పట్ల వివక్షతను ప్రదర్శించకుండా వారి అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ నగరంలో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పాత కలెక్టరేట్ గ్రౌండ్ నుండి ప్రధాన వీధుల మీదుగా న్యూ అంబేద్కర్ భవన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. బేటీ బచావో బేటీ పడావో, బాలికలను రక్షిద్దాం అని నినాదాలు చేస్తూ విద్యార్థినులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రసూల్ బీ, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలి....

రానున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి బాధ్యతతో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై కలెక్టరేట్ లోని వీ.సీ హాల్ లో నోడల్ అధికారులతో కలెక్టర్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నోడల్ అధికారులు ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో ముందస్తుగానే సిద్ధమై ఉండాలని, అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కాగా పాటించాలని, ఏ దశలోనూ అలసత్వానికి తావివ్వకూడదని అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తప్పిదాలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతి అధికారి బాధ్యతతో పని చేయాలని, శాఖల మధ్య సమన్వయం ఉండేలా చొరవ చూపాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత తహసిల్దార్లు పాల్గొన్నారు.

పాఠశాలకు బ్యాండు అందజేత..

ప్రతి పక్షం,రాయపోల్ జనవరి 24:

లయన్స్ క్లబ్ అఫ్ గజ్వేల్ స్నేహ ప్రెసిడెంట్ లయన్ ఉప్పల మెట్టయ్య సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలంలోని పెద్ద ఆరెపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాండును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైన్స్ క్లబ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చేయూతను అందిస్తుందని. నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. చదువులో విద్యార్థులు మంచిగా చదువుకొని గ్రామాలకు పాఠశాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు. చదువుతోనే విద్యార్థులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ వైస్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ కుమారస్వామి, జిఎంటి కో ఆర్డినేటర్ లయన్ పరమేశ్వర చారి,జోన్ చైర్మన్ లయన్ మల్లేశం గౌడ్, లయన్ మధుసూదన్, లయన్ తాటి రాములు. మాజీ సర్పంచ్ దుర్గం మల్ల గౌడ్. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయిత చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బల్బులో జాతీయ జెండా..

ప్రతిపక్షం,మెదక్ టౌన్,జనవరి 24

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ కు చెందిన యువకుడు బచ్చలి.మోహన్ ఏదో ఒక ప్రత్యేకమైన తయారీతో ఆకట్టుకోవడం అలవాటుగా మార్చుకున్నాడు.తన సృజనాత్మకతతో అందరినీ ఆకట్టుకుంటున్నాడు. తనదైన శైలిలో వినూత్నతను చాటుకుంటున్న ఓ యువకుడు అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. జాతీయాభిమానం, దేశ ఆదర్శ ప్రాయులపై తనకున్న అభిమానాన్ని ప్రత్యేక రీతిలో విశేషత కనబరుస్తూ పలువురి మన్ననలు పొందుతున్నాడు.గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశాభిమానాన్ని ప్రదర్శించడంలో భాగంగా విద్యుత్ బల్బులో మన భారత దేశ పతాకాన్ని అమర్చి జాతీయతను ప్రదర్శించాడు.కాదేదీ కళకు అనర్హం అన్నట్లుగా ఐస్ క్రీం పుల్లలు, నాచు, మట్టి, రంగులను మాత్రమే

వాడి మూడు రంగుల జెండాను బల్బులో ఆకర్షణీయంగా అమర్చి శభాష్ అనిపించుకున్నాడు. ఇంతకు ముందు కూడా కొబ్బరి కాయపై రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, ఐపీఎల్ క్రికెట్ కప్ లాంటి చిత్రాలను చిత్రీకరించి అందరి మెప్పు పొందాడు. ప్రస్తుతం జాతీయ పతాకాన్ని బల్బులో తయారు చేసి ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్న మోహన్ ను ప్రతీ ఒక్కరూ అభినందిస్తున్నారు.

మహనీయుడు అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 24:

మహనీయుడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చదువులో రాణించాలని గాజులపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్యాగరాజు అన్నారు. శనివారం గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో రాజ్యాంగంపై అంబేద్కర్ పాత్ర అంశం పై 4వ, 5వ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలో మొదటి విజేతగా గొల్లపల్లి కృష్ణ, రెండవ విజేతగా గొల్లపల్లి వెన్నెల ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మొదటి బహుమతి రూ.1000, రెండవ బహుమతి కి రూ. 500 నగదు ప్రోత్సాహాన్ని గణతంత్ర దినోత్సవం రోజు న అందజేస్తామని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నవీన్ రెడ్డి, నర్సింలు, రజిత జ్యోతి, రోజా, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ చేసిన పనుల్ని ప్రజలు మరిచిపోతే మళ్లీ వినాశనమే. తన మనుషుల్ని పెట్టుకొని ల్యాండ్ టైటిలింగ్‌తో భూమి కాజేసే ప్రయత్నం చేశారు. చివరకు దేవునికిచ్చిన నెయ్యినీ కల్తీ చేశారు. రాక్షసపాలన సాగించారు. తప్పుడు కేసుతో నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు అమరావతిని అడ్డుకుంటున్నారు. నేను క్రెడిట్ చోరీ చేశానంటున్నారు. ఆయనకేం క్రెడిట్ ఉంది.
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ప్రాంతీయం

బైక్ పైనుండి పడి యువకుడు మృతి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ జనవరి 24 :

మెదక్ జిల్లా హవేలిగన్పూర్ మండలం లోని దూప్ సింగ్ తాండకు చెందిన కే సుభాష్ 34 సంవత్సరాలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం దూప్ సింగ్ తండా కు చెందిన సుభాష్ మెదక్ నుండి తిరుగు ప్రయాణం లో భాగంగా ఇంటికి వెళ్లే సమయంలో హవేలి ఘనపూర్ గ్రామ శివారులో ఓ వ్యక్తికి బైకునుఢీకొట్టడంతో బైక్ కంట్రోల్ తప్పి కింద పడటం వల్ల తలకు బలమైన గాయం తలగడంతో ప్రత్యక్ష సాక్షులు అందించిన సమాచారం మేరకు పోలీసులు చేరుకొని 108 వాహనంలో మెదక్ ఏరియాస్ ఆసుపత్రికి తరలించగా తలకు తీవ్రమైన గాయడం కావడంతో ప్రథమ చికిత్స చేసి న తర్వాత డాక్టర్ల సూచన మేరకు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారని తెలిపారు. మంగళవారం నాడు ఘటన జరగడంతో నాలుగు రోజులు మృతులతో పోరాడిన సుభాష్ చివరికి మరణించడంతో దూప్ సింగ్ తాండ గ్రామంలో విషాదఛాయలాలు ఉన్నాయి. మృతునికి భార్య, ఒక కూతురు ,ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ యజమాని మరణించడంతో భార్య పిల్లల పరిస్థితి అగమ్య గోచరంగ మారిద్దని తాండవాసులు అశోక సముద్రంలో మునిగిపోయారు. ప్రభుత్వం స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని తాండవాసులు కోరారు.

సిద్దిపేట మున్నూరు కాపు సంఘ అభివృద్ధికి
ఎంపీ రఘునందన్ రావు 10 లక్షల నిధుల కేటాయింపు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 24:

సిద్దిపేట మున్నూరు కాపు సంఘ అభివృద్ధి కోసం మెదక్ ఎంపీ రఘునందన్ రావు తన నిధుల నుండి 10 లక్షల రూపాయలు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని సిద్దిపేట మున్నూరు కాపు సంఘం సలహా మండలి సభ్యులు భూమయ్య తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మున్నూరు కాపు సంఘంలో అదనపు గదుల నిర్మాణానికి ఇప్పుడు 10 లక్షల రూపాయల ప్రొసీడింగ్ ఎంపీ చేతుల మీదుగా అందుకున్నామన్నారు. అలాగే మార్చిలో మరొక 10 లక్షల నిధులు మంజూరు చేయిస్తానని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు అన్నారు. సంఘం అభివృద్ధి కోసం మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు నీలం యాదగిరి చేసిన కృషి అభినందనీయమన్నారు. అందుకు ఎంపీ రఘునాథన్ రావుకు మాజీ అధ్యక్షులు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే సిద్దిపేట మున్నూరు కాపు సంఘం ఎన్నికల్లో ఫిబ్రవరిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటివరకు ఐదుగురు సభ్యులతో కూడిన సలహా మండలి ఆధ్వర్యంలో సంఘ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో మున్నూరు కాపు సంఘం నాయకులు బుస్స శ్రీనివాస్, పాల శేఖర్, నాయకం తిరుపతి, పోలీస్ రాజులు పలువురు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరం

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 24:

మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరం అని గాజులపల్లి సర్పంచ్ పంజ స్వామి అన్నారు. శనివారం ఈసీసీ డే మన ఊరు మన అంగన్వాడీ కిచెన్ గార్డెన్ లో అంగన్వాడి టీచర్ సరోజన తో కలిసి సర్పంచ్ స్వామి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్లపల్లి ప్రేమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, యువజన నాయకులు, గాడి ఆంజి,కనక రెడ్డి,రాజు, ఆర్ట్స్ రాజు, గొల్లపల్లి పవన్, రాజిరెడ్డి, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ మున్సిపల్ పై బీజేపీ జెండా ఎగరాలి

- **జిల్లా అధ్యక్షులు మల్లేశం గౌడ్**
- **పట్టణంలో మున్సిపల్ సన్నాహక సమావేశం**

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 24:-

మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలలో మెదక్ నర్సాపూర్ తూప్రాన్ రామాయంపేట మున్సిపాలిటీలలో బిజెపి జంట ఎగురుతుందని ప్రతి కార్యకర్త బిజెపి అభ్యర్థులను బలపరిచి గెలిపించాలని మెదక్ బిజెపి జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ తెలిపారు శనివారం భారతీయ జనతా పార్టీ మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ అధ్యక్షతన మెదక్ జిల్లా బిజెపి కార్యాలయంలో మెదక్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగమేశ్వర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ. మున్సిపల్ ఎన్నికల మేనేజ్మెంట్ టీం వార్డు కు ఒక 9 మందితో కమిటీ లతో వార్డు అభ్యర్థులు ప్రచారం చేయాలని తప్పకుండా మెదక్ మున్సిపల్ కైవసం చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు చేతుల మీదుగా బీ ఫోరం అందజేస్తాం కార్యకర్తలు అందరూ కూడా కలిసికట్టుగా పనిచేసే బిజెపి జెండా ఎగరవేయాలని తెలిపారు. మెదక్ మున్సిపల్ 24 వార్డు బిజెపి అభ్యర్థిగా యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్ ధరకాస్తు చేసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి ట్రిమెన్ కన్వీనర్ MLN రెడ్డి కో కన్వీనర్ ఆకుల ప్రభాకర్ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్ జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు మాజీ జడ్పీటీసీ పంజా విజయ్ మండల అధ్యక్షులు సర్పంచ్ బెండె వీణ సర్పంచ్ లింగ గౌడ్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సంగీత మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లా రెడ్డి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ కుమార్ జిల్లా నాయకులు మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎం కప్ 2025 పోటీలను విజయవంతం చేయాలి

- **మండల అభివృద్ధి అధికారిణి సంధ్య**

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 24 :

సీఎం కప్ 2025 పోటీలను విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారిణి సంధ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి, మండలంలోని వివిధ వ్యాయమ ఉపాధ్యాయులు, పోలీసు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఈ నెల 29,30వ తేదీల్లో మండల పరిధిలోని చిల్కూర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీఎం కప్ 2025 క్రీడల పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున గ్రామీణ ప్రాంతా క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడల్లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. క్రీడాకారులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, షార్ట్ పుట్, లాంగ్ జంప్ లు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు ఆన్లైన్ లో పేరు నమోదు చేసుకోకపోయినా నేరుగా వచ్చిన ఆడేందుకు వీలు కల్పించడం జరుగుతుందన్నారు. కావున గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు ఈ యొక్క పోటీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, ఆయా గ్రామాల పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రయోజనార్థం బైపాస్ రోడ్ విస్తరణ

- **కూల్చివేతలు పర్యవేక్షించిన జగ్గారెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 24

సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్ విస్తరణ పనులు గత రెండు రోజులుగా చురుకుగా కొనసాగుతున్నాయి. ఈ పనులను శనివారం సాయంత్రం జగ్గారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. బైపాస్ రోడ్ విస్తరణలో భాగంగా ఆర్అండ్బి గెస్ట్ హౌజ్ నుంచి బసవేశ్వర విగ్రహం వరకు రోడ్డును వెడల్పు చేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ అందజేశామని, ఇందుకు స్పందించిన సీఎం రూ.12 కోట్ల నిధులను మంజూరు చేశారని జగ్గారెడ్డి తెలిపారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ విస్తరణలో భాగంగా శనివారం ఆర్అండ్బి ప్రహరీ గోడతో పాటు ఆర్డీవో ఇంటిని ప్రజల ప్రయోజనాల కోసం జగ్గారెడ్డి దగ్గరుండి కూల్చివేయించారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ప్రశాంత్ నగర్, ఇందిరా కాలనీ, విజయ్ నగర్ కాలనీ, డ్రైవర్స్ అసోసియేషన్ కాలనీ, బాలాజీ నగర్ కాలనీ, రెవెన్యూ కాలనీ, బ్యాంకర్స్ కాలనీ, అయ్యప్ప కాలనీ, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కాలనీ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని తెలిపారు. బైపాస్ రోడ్ విస్తరణలో కేవలం ప్రభుత్వానికి సంబంధించిన నిర్మాణాలను మాత్రమే తొలగిస్తున్నామని, ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్చివేయబోమని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఎ, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, పీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్‌తో పాటు నాయకులు బొంగుల రవి, రఘు గౌడ్, జార్జ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధే భవితకు భరోసా

- **గీతం ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన సీనియర్ డేటా సైంటిస్ట్ ప్రవీణ్ కుమార్**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 24 :

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కృత్రిమ మేధస్సు, డేటా సైన్సులో నైపుణ్యాభివృద్ధి సాధించాలని, అప్పుడు ఉద్యోగాలే మనను వెతుక్కుంటూ వస్తాయని అమెజాన్ ఇండియా సీనియర్ డేటా సైంటిస్ట్, ఏఐ లీడ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణితం, గణాంకాల విభాగం ఆధ్వర్యంలో 'నేర్చుకోవడానికి, నిర్మించడానికి, వినియోగించడానికి అవసరమైన కృత్రిమ మేధస్సు ప్రాథమికాంశాలు' అనే అంశంపై శనివారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. డేటా సైన్స్, అనలిటిక్స్, కృత్రిమ మేధస్సులో దాదాపు 14 ఏళ్లకు పైగా ఆయనకున్న పరిశ్రమ అనుభవాన్ని ఉపయోగించి, ప్రవీణ్ కుమార్ వాస్తవ ప్రపంచంలో కృత్రిమ మేధస్సు పరిష్కారాలను నేర్చుకోవడం, నిర్మించడం, వినియోగించుకోవడంపై ఆచరణాత్మక విధానాలతో కూడిన విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. పరిశ్రమ అంచనాలు, ఆరోగ్య సంరక్షణ, కేంద్రీకృత కృత్రిమ మేధస్సు వినియోగం, జనరేటివ్ ఏఐలో ఉద్భవిస్తున్న ధోరణులను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఇది విద్యార్థులకు ఆ రంగంలో ప్రస్తుత, భవిష్యత్తు అవకాశాలపై స్పష్టమైన దృక్పథాన్ని ఏర్పరచింది.ఈ కార్యక్రమంలో గీతం, ఇతర కళాశాలల ఎమ్మెస్సీ డేటా సైన్స్ విద్యార్థులు, పలువురు అధ్యాపకులు దాదాపు 300 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ బీ.ఎం.నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా హాజరయ్యారు. పరిశ్రమవిద్యా సహకారాన్ని బలోపేతం చేయడంలో గీతం నిబద్ధతను వారు ప్రోత్సహించారు. ఈ ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని గణిత, గణాంక విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి సమన్వయం చేశారు.

బాలికలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యం

ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, జనవరి 24:

బాలికలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని, శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే మేధాశక్తి సమృద్ధిగా ఉంటుందని మాజీ టీటీడీ బోర్డు మెంబర్ మొరం శెట్టి రాములు అన్నారు. బాలిక సాధికారక దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహార కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు చేపట్టిన సందర్భంగా తన వంతుగా ప్రతిరోజు అల్పాహారం అందిస్తామని మొరం శెట్టి రాములు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని గవర్నమెంట్ న్యూ హైస్కూల్లో ఇప్పటికే కార్యక్రమం కొనసాగుతుందని నేటి నుండి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కూడా అల్పాహారం అందిస్తామని తెలిపారు. విద్యార్థులందరూ బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పూర్ణిమ ఎల్లం, అడ్వకేట్ రేణుక, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

బాలామృతాన్ని ప్రతి ఒక్కరూ
సద్వినియోగం చేసుకోవాలి

- **సర్పంచ్ మద్యపాగ కృష్ణ**

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 24 : పిల్లల ఆరోగ్యానికి ఎంతోమేలు చేసే బాలామృతాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మద్యపాగ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు అంగన్ వాడీ టీచర్లు స్వర్ణలత, సరస్వతి ఆధ్వర్యంలో బాలామృతాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మద్యపాగ కృష్ణ హాజరై మాట్లాడారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెంచుతుందని తెలిపారు. శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని వివరించారు.పిల్లల్లో అకలిని పెంచుతుందని, రక్తహీనతను నివారిస్తుందని, పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుందని, అలాగే కంటిచూపును మెరుగుపరుస్తుందన్నారు. కావున తప్పనిసరిగా పిల్లల తల్లిదండ్రులు పిల్లలకు బాలామృతాన్ని తాపించాలన్నారు. అనంతరం అంగన్ వాడీ టీచర్లు సర్పంచ్ మద్యపాగ కృష్ణను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తూర్పు జితేందర్ రెడ్డి, వార్డు సభ్యులు కృష్ణ, రామ్మోహన్ రెడ్డి, కారోబార్, గ్రామస్తులు తదితరులున్నారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి

ప్రతిపక్షం, చేగుంట, జనవరి24:

పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మెదక్ జిల్లా ఖాజాపూర్ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకున్నారు. ఇందులో సంకాపూర్ నార్సింగి మండలం లోని వివిధ గిరిజన తండాలకు చెందిన వారు ఉన్నారు. పేకాట రాయుళ్లు ఆడుతున్న సమయంలో స్టార్ స్పోర్ట్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో దాడులు నిర్వహించారు. ఇందులో బాల్య బద్రునాయక్ శంకర్ నాయక్ బానోత్ ప్రకాష్ నేనావత్ అనిల్ లను పట్టుకున్నారు. నలుగురు వ్యక్తులు సంకాపూర్ తండా నార్సింగ్ మండలంలోని తండాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వీరి నుండి 8,725 రూపాయల నగదు నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు.

ఉచిత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించిన అడిషనల్ కలెక్టర్

- **ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలి**
- **జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆర్ .పాండు**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 24 :

గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బి, ఎస్ఐ , కానిస్టేబుల్, ఎస్ ఎస్ సి తదితర పోటీ పరీక్షలకు స్థానిక టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఫౌండేషన్ కోర్సు ద్వారా 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అడిషనల్ ఆర్.పాండు అన్నారు . శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి , స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శ్రీకాంత్ లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు . ఈ నెల 30 వ తేదీ వరకు దరఖాస్తు లను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా లోని డిగ్రీ పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్ లో tsstudycercle. co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 8 న సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఎంట్రన్స్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా , మెరిట్ ఆదరంగా ఎస్సీలకు 75, బీసీ లకు 15 , ఎస్టీ లకు 10 శాతం సీట్లు కేటాయిస్తారని చెప్పారు ఇందులో ఫిజికల్ హ్యాండీక్యాప్ అభ్యర్థులకు 5, మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తారని చెప్పారు 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ అధికారి. వెంకటేశ్వర్లు.జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి. అఖిలేష్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సింగరేణిపై ఎంక్వైరీ వేయడాన్ని ఆహ్వానిస్తున్నా. 105ఏళ్లుగా సింగరేణి కొనసాగుతోంది. ఆ సంస్థ నిర్ణయాలు మంత్రి వద్దకు రావు. కోల్ ఇండియా 2018లో టెండర్ డాక్యుమెంట్ పంపింది. సైట్ విజిట్ తప్పనిసరి అని సీఎంపీడిఐ డాక్యుమెంట్‌లో ఉంది. ఆ సమయంలో మా ప్రభుత్వం లేదు. 2021, 2023లో కోల్ ఇండియా, ఎన్ఎండీసీ పంపిన డాక్యుమెంట్లలోనూ సైట్ విజిట్ అని ఉంది.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సింగిడి
హైదరాబాద్
ఆదివారం
25.01.2026

ప్రతిపక్షం
Prathipaksham.in

భారత్‌పై టారిఫ్‌లు తగ్గించే యోచనలో అమెరికా

- 25 శాతం పన్నుల ఎత్తివేతకు రంగం సిద్ధం
- దావోస్ వేదికగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు
- రష్యా నుంచి ఆయిల్ కొనడం మానేశారని కితాబు

రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు గానూ భారత్‌పై విధించిన అదనపు పన్నులను ఎత్తివేసే యోచనలో అమెరికా ఉన్నట్లు తెలుస్తోంది. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ప్రస్తుతం అమలు చేస్తున్న 25 శాతం టారిఫ్‌లను త్వరలోనే వెనక్కి తీసుకునే అవకాశం ఉందని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో శుక్రవారం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధించిన పన్నుల దెబ్బకు భారత రిఫైనరీలు రష్యా ఆయిల్ కొనుగోళ్లను భారీగా తగ్గించాయని, ఇది తమకు దక్కిన అతిపెద్ద విజయమని ఆయన అభివర్ణించారు.

విశ్వ వీక్షణం

ఉగ్ర కుట్ర భగ్నం..

మరో రెండు రోజుల్లో రిపబ్లిక్ డే ఉందనగా ఇంటెలిజెన్స్ అధికారులు ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. జనవరి 26న దేశంలో రిపబ్లిక్ డే ఉత్సవాలను నిర్వహించుకోవడానికి సిద్ధమవుతుండగా ఉగ్ర దాడుల కుట్ర బయటపడింది. దేశంలో ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందడంతో ఈ మేరకు గాలింపు చర్యలు చేపట్టిన ఇంటెలిజెన్స్ అధికారులు, పోలీసులు ఖలిస్థానీ సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ ముఠాను పంజాబ్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు సభ్యులు గల ఈ ఉగ్రవాదులను అరెస్టు చేసి, వారి నుంచి 2.5 కిలోల ఆర్డీఎక్స్‌ను, భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. విచారణలో వారు రిపబ్లిక్ డే వేడుకల్లో దాడులకు వారు కుట్ర పన్నినట్లు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను శరణ్ ప్రీత్ సింగ్, దిల్జోత్ సింగ్ సైని, హర్మాన్, అజయ్, అర్ష్‌దీప్ సింగ్‌లుగా గుర్తించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఉగ్ర ముఠాను అమెరికాకు చెందిన బబ్బర్ ఖల్సా హ్యాండ్లర్లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వారి ఆదేశాల మేరకు నిందితులు పలు ప్రాంతాల్లో దాడులకు ప్రణాళికలు రచించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వివరించారు. ఉగ్రవాద ముఠాలు దేశంలోని పలు ప్రాంతాల్లో మరిన్ని దాడులకు ప్లాన్ చేస్తుండడంతో దేశ రాజధాని ఢిల్లీ సహా ముఖ్యనగరాల్లో భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో గణతంత్ర దినోత్సవానికి భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామన్నారు. దేశంలో మరిన్ని ఉగ్ర కుట్రలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు.

బెంగాల్‌లో హడావుడిగా ఎస్ఐఆర్

బెంగాల్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ (92 ఏళ్లు) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరికొద్ది నెలల్లో బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో, ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత వేగంగా, హడావుడిగా, అనవసర తొందరపాటుతో నిర్వహిస్తున్నారని, దీని వల్ల ప్రజాస్వామ్య భాగస్వామ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. బోస్టన్ నుంచి ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కశ్మీర్‌లో జైషే టాప్ కమాండర్ హతం



జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం సమీపిస్తుండటంతో తీవ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందన్న అనుమానంతో భద్రతా దళాలు జమ్మూ కశ్మీర్‌లో ముమ్మర తనిఖీలు చేస్తున్నాయి. ఈక్రమంలో ఉగ్ర వ్యతిరేక ఆపరేషన్లలో భద్రతా బలగాలు కీలక విజయం సాధించాయి. కశ్మీర్‌లోని కథువా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో జైషే మహమ్మద్‌కు చెందిన కరుడుగట్టిన ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. బిల్లావర్‌లోని పర్హెటర్ ప్రాంతంలో ఇండియన్ ఆర్మీ, సీఆర్‌పీఎఫ్‌ల సంయుక్త నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో జైషే కమాండర్ ఉస్మాన్ అలియాస్ అబూ మవియా హతమైనట్లు జమ్మూ ఐజీ భీమ్ సేన్ టుటి వివరించారు. మారుమూల గ్రామంలోని ఓ ఇంట్లో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో బలగాలు దాడి చేయగా లోపల దాక్కున్న ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ సందర్భంగా ఆర్మీ కూడా ప్రతీగా జరిపిన ఎదురుకాల్పుల్లో ఉస్మాన్ హతమయ్యాడని చెప్పారు. ఘటనలో అత్యాధునిక ఎం4 ఆటోమేటిక్ రైఫిల్‌తోపాటు పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి కూడా పట్టుబడ్డాయని ఆర్మీ అధికారులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన కార్డన్ సెర్చ్ సందర్భంగా ఓ విదేశీ ఉగ్రవాదిని చంపేసినట్లు ఆర్మీ ఎక్స్‌లో తెలిపింది. ఆ ప్రాంతంలో కూంబింగ్ ఇంకా కొనసాగుతోందని కూడా వెల్లడించింది. ఈ నెల 7, 13వ తేదీల్లో కహోగ్, నజోట్ అటవీ ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఉస్మాన్ తప్పించుకున్నాడని పేర్కొంది. పాకిస్తాన్‌కు చెందిన ఉస్మాన్ రెండేళ్ల క్రితం దొంగచాటుగా సరిహద్దులు దాటి కశ్మీర్‌లోకి ప్రవేశించాడు. ఉధంపూర్ - కథువా ప్రాంతంలో జైషే మహమ్మద్ ఉగ్రవాదిగా కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఉస్మాన్ జైషే మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా మారాడు . గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో బలగాలు ఆపరేషన్ త్రాషి-ఇ పేరుతో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక పారాట్రూపర్ నేలకొరగ్గా, ఏడుగురు జవాన్లకు గాయాలయ్యాయి. నాలుగు రోజులపాటు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోలేదు. గురువారం ఎదురుకాల్పుల సమయంలో ఉస్మాన్ మరికొందరు దట్టమైన అటవీ ప్రాంతాన్ని అవకాశంగా మల్చుకుని పరారయ్యారు. తాజా ఎన్‌కౌంటర్‌లో నెలకొరిగాడు.

గవర్నర్ తీరుపై స్టాలిన్ ఫైర్

అసెంబ్లీ సమావేశాల ప్రారంభ సందర్భంగా తన ఉపన్యాసాన్ని చదవకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి తన హోదాను అవమానించారని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం విమర్శించారు. తమిళనాడు అనేక గవర్నర్లను చూసిందని, కాని ఎవరూ రవి లాంటివారు కారని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రసంగాన్ని చదవకుండా ముందుగానే జాతీయ గీతాన్ని ఆలపించాలని గవర్నర్ రవి ఒత్తిడి చేశారని స్టాలిన్ చెప్పారు. మరోవైపు ప్రధాని మోదీది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు.. డమ్మీ ఇంజిన్ ప్రభుత్వమని స్టాలిన్ శనివారం తీవ్రంగా ధ్వజమెత్తారు. తమిళనాడులో బీజేపీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అనివార్యమని మోదీ ప్రకటించిన కొన్ని గంటల అనంతరం స్టాలిన్ ఎదురుదాడి చేశారు.

షుగర్ కంట్రోల్ & హెల్తీ లైఫ్

డయాబెటిస్ తో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుందనే చెప్పవచ్చు. మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల కారణంగా ఈ సమస్య తలెత్తుతుంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరినీ ఈ సమస్య ఇబ్బంది పెడుతుంది. డయాబెటిస్ తో బాధపడే వారు మందులు వాడడంతో పాటు తీసుకునే ఆహార విషయంలో కూడా చాలా జాగ్రత్తలు వహించాలి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచే ఆహారాలతో పాటు శరీరానికి పోషకాలను, శక్తిని అందించే ఆహారాలను కూడా తీసుకోవాలి. ఇలా సరైన ఆహారాలను తీసుకున్నప్పుడే డయాబెటిస్ తో బాధపడే వారిలో పోషకాహార లోపం తలెత్తకుండా ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారికి శరీరానికి శక్తిని అందించడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించే ఉత్తమ ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

గింజలు, విత్తనాలు..

డయాబెటిస్ రోగులకు గింజలు, విత్తనాలు కూడా ఎంతో మేలు చేస్తాయి. బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా విత్తనాలు ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. అదే విధంగా స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్బెర్రీ వంటి పండ్లల్లో ఇతర పండ్లల్లో కంటే చక్కెర స్థాయిలు తక్కువగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. కనుక డయాబెటిస్ తో బాధపడే వారు ఈ పండ్లను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారు సాల్మన్, సార్డిన్స్, మాకేరెల్ వంటి చేపలను తీసుకునే ప్రయత్నం చేయాలి. వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి డయాబెటిస్ ను అదుపులో ఉంచడంతో పాటు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

పెరుగు..

పెరుగును తీసుకోవడం వల్ల పేగుల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు కూడా స్థిరంగా ఉంటాయి. బీన్స్, శనగలు వంటి వాటిని కూడా ఆహారంలో భాగంగా చేసుకోవాలి. వీటిలో ఫైబర్ తో పాటు ప్రోటీన్ కూడా ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలు అన్నీ అందడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ తో బాధపడే వారు తరచూ నీరసం, అలసట వంటి సమస్యలతో బాధపడుతూ ఉంటారు. అలాంటి వారు ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల శక్తి స్థాయిలు స్థిరంగా ఉండడంతో పాటు డయాబెటిస్ కూడా అదుపులో ఉంటుంది.

బ్రౌన్ రైస్, ఓట్స్..

డయాబెటిస్ వ్యాధి గ్రస్తులు ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. పాలకూర, కాలే, మెంతి ఆకు వంటి వాటిలో క్యాలరీలు, కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉంటాయి. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడతాయి. అలాగే బ్రౌన్ రైస్, ఓట్స్, చిరుధాన్యాలను తీసుకోవాలి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల నెమ్మదిగా జీర్ణమవుతాయి. కడుపు నిండిన భావన కలుగుతుంది. వీటిని తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిల్లో వచ్చే ఆకస్మిక పెరుగుదలను నివారించవచ్చు. కాయధాన్యాల్లో ఫైబర్ తో పాటు ప్రోటీన్ ఉంటుంది. ఇవి చక్కెర శోషణ నెమ్మదిగా జరిగేలా చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు స్థిరంగా ఉంటాయి.



ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

ప్రాక్టీస్ షురూ చేసిన ధోనీ

మహేంద్రసింగ్ ధోనీ ఫ్యాన్స్‌కు కిక్కిచ్చే న్యూస్. రానున్న ఐపీఎల్ సీజన్ కోసం మహీ ప్రాక్టీస్ మొదలుపెట్టేశాడు. రాంచీలోని ఓ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. కాళ్లకు ప్యాడ్లు కట్టుకొని నెట్స్‌లో బ్యాటింగ్ సాధన షురూ చేశాడు. దీనికి సంబంధించిన వీడియోను జార్ఖండ్ క్రికెట్ అసోసియేషన్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. 'జార్ఖండ్ క్రికెట్‌కు గర్వకారణమైన మహేంద్రసింగ్ ధోనీ ఈజ్ బ్యాక్' అంటూ పోస్ట్‌కు క్యాప్షన్ రాసుకొచ్చింది.దీంతో మహీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ ఐపీఎల్‌లో తన బ్యాటింగ్ చూసేందుకు వెయిటింగ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. 44 ఏళ్ల ధోనీ కెరీర్‌లో 19వ ఐపీఎల్ సీజన్ ఆడేందుకు రెడీ అవుతున్నాడు. మరోసారి మహీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరఫునే బరిలోకి దిగనున్నాడు. యువ నాయకుడు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో ధోనీ ఆడనున్నాడు. అయితే గత సీజన్‌లో ధోనీ ఆఖర్లో బ్యాటింగ్‌కు వచ్చి సిక్సులతో హుషారెత్తించాడు. దీంతో 14 మ్యాచ్‌ల్లో 24.50 యావరేజ్‌తో 196 పరుగులే చేశాడు.ఈసారి ధనాధన్ షాట్‌లతోపాటు, భారీ ఇన్నింగ్స్ ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు. ధోనీ ఐపీఎల్‌లో ఇప్పటిదాకా 278 మ్యాచ్‌ల్లో 5439 పరుగులు చేశాడు. ఇందులో 24 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కాగా, 2026 సీజన్ ఐపీఎల్ 26న ప్రారంభం కానుంది. అయితే టోర్నీకి సంబంధించిన పూర్తి షెడ్యూల్ మాత్రం ఇంకా రిలీజ్ కాలేదు.

అండర్-19 సూపర్ సిక్స్‌లో భారత్..

ప్రతిష్టాత్మక అండర్ 19 ప్రపంచకప్‌లో యువ భారత్ సూపర్ సిక్స్‌లోకి దూసుకెళ్లింది. సమష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ కప్ వేటలో మరో అడుగు వేసింది. తమ చివరి లీగ్ పోరులో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై(డీఎల్ఎస్) 141 బంతులు మిగిలుండగానే ఘన విజయం సాధించింది. వర్షం అంతరాయం మధ్య సాగిన మ్యాచ్‌లో కివీస్‌పై టీమ్ఇండియాదే పైచేయి అయ్యింది. ఈ విజయంతో గ్రూపు దశలో మూడింటికి మూడు గెలిచిన భారత్ అగ్రస్థానంతో సూపర్‌సిక్స్‌లోకి ప్రవేశించింది. తొలుత అంబరీశ్ (4/29), హెనిల్‌పటేల్(3/23)ధాటికి కివీస్ 36.2 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలింది. వీరిద్దరి విజృంభణతో కల్లమ్ సాంప్సన్(37 నాటౌట్) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ఆ తర్వాత నిర్దేశిత లక్ష్యఛేదన(37 ఓవర్లలో 130)కు దిగిన భారత్ 13.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. కెప్టెన్ ఆయూశ్ మాత్రె(27 బంతుల్లో 53, 2ఫోర్లు, 6సిక్సులు),వైభవ్ సూర్యవంశీ(23 బంతుల్లో 40, 2ఫోర్లు, 3సిక్సులు) అదరగొట్టడంతో గెలుపు నల్లేరుపై నడకయ్యింది.నాలుగు వికెట్లతో విజృంభించిన అంబరీశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. సూపర్ సిక్స్ తొలి పోరులో యువ భారత్ ఈనెల 27న జింబాబ్వే, ఫిబ్రవరి 1న దాయాది పాకిస్థాన్‌తో తలపడుతుంది.

అంబరీశ్, హెనిల్ విజృంభణ:

టాస్ గెలువగానే మరో ఆలోచన లేకుండా భారత కెప్టెన్ ఆయూశ్‌మాత్రె..న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. బౌలింగ్‌కు పూర్తిగా తమకు అనుకూలంగా ఉండటంతో అంబరీశ్, హెనిల్ పదునైన పేస్‌తో కివీస్‌ను ఘోరంగా దెబ్బకొట్టారు. సూపర్‌స్వింగ్‌తో వరుసగా వికెట్లు తీసి స్వల్ప స్కోరుకు పరిమితం చేశారు. ఓపెనర్ హ్యుగో బోగ్(5)తో మొదలైన కివీస్ వికెట్ల పతనం ఆఖరి వరకు దిగ్విజయంగా సాగింది. ఆఖర్లో సాంప్సన్‌కు తోడు సెల్విన్ సంజయ్(28), కాటర్(23) ఆకట్టుకోవడంతో వంద పరుగుల మార్క్ దాటింది.

ఢిల్లీ బౌలింగ్ పంజా

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. ప్లేఆఫ్స్ రేసులో నిలువాలంటే తప్పక గెలువాల్సిన పోరులో సత్తాచాటింది. శనివారం జరిగిన పోరులో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)పై ఘన విజయం సాధించింది. తద్వారా వరుసగా రెండో విజయంతో రెండో స్థానంలోకి దూసుకొచ్చింది.ఆర్‌సీబీ నిర్దేశించిన 110 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 15.4 ఓవర్లలో 111/3 స్కోరు చేసింది. లారా వోల్వార్డ్(42 నాటౌట్) రాణించగా, కెప్టెన్ రోడ్రిగ్స్(24) ఆకట్టుకుంది. సయాలీ(2/18) రెండు వికెట్లు తీసింది. తొలుత ఆర్‌సీబీ 20 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. డబ్ల్యూపీఎల్‌లో ఆర్‌సీబీకి ఇదే అత్యల్ప స్కోరు. మందన(38) టాప్ స్కోరర్‌గా నిలిచింది. నందని(3/26), కాప్(2/17) ఆర్‌సీబీ పతనంలో కీలకమయ్యారు.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్ జోరు

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెర్బియా టెన్నిస్ స్టార్ నోవాక్ జొకోవిచ్ వరుస రికార్డుల పరంపర కొనసాగుతున్నది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో జొకోవిచ్ 63, 64, 76(4)తో బోటిక్ వాన్ డీ జాన్‌షుల్ప్‌పై అద్భుత విజయం సాధించాడు. తద్వారా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఓవరాల్‌గా 400 విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డుల్లోకెక్కాడు. తన కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు దక్కించుకున్న ఈ సెర్బియా స్టార్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో గెలుపు, ఓటముల రికార్డు(10210)ను మరింత మెరుగుపర్చుకున్నాడు. మరో సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సిన్నర్ 46, 63, 64, 64తో స్విజిరి(అమెరికా)పై విజయం సాధించాడు.

నేనేం నేరం చేయలేదు!

పరిమితులను గుర్తించి పనిచేస్తే.. ఎవరైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అంటున్నది బాలీవుడ్ వెటరన్ స్టార్ రిమీ సేన్. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా ధూమ్ ఫేమ్ జాన్ అబ్రహం పేరును ప్రస్తావిస్తున్నది. ధూమ్, హేరా ఫేరీ, హంగామా, గోల్‌మాల్ లాంటి బ్లాక్‌బస్టర్ సినిమాల్లో నటించిన రిమీ సేన్..ప్రస్తుతం దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్నదట. తాజాగా, అక్కడి ఓ రియల్ ఎస్టేట్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కనిపించింది. ఈ సందర్భంగా దుబాయ్ ముచ్చట్లతోపాటు ధూమ్ సినిమాలో తన సహనటుడైన జాన్ అబ్రహం గురించి పలు ఆసక్తికర విషయాలనూ పంచుకున్నది. "జాన్ అబ్రహం ఒక మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టాడు. అతనికి నటన గురించి ఏమాత్రం తెలియదు. తన నటనపై ఎన్నో విమర్శలు వచ్చేవి. అయినా, ఆయన ఎప్పుడూ పట్టించుకోలేదు. నటన కన్నా.. బాడీ, లుక్స్‌పైనే ఫోకస్ పెట్టాడు. యాక్షన్ సినిమాలనే ఎంచుకున్నాడు. తనవైపు ఎవరూ వేలెత్తి చూపకుండా ఉండేలా జాగ్రత్త పడ్డాడు. అందుకే జాన్ చాలా తెలివైన నటుడు" అంటూ తన అభిప్రాయాన్ని పంచుకున్నది. ఇక సినిమాల్లో ఒక్కసారి క్రేజ్ వచ్చాక, సెట్‌లో, కెమెరా ముందు సమయం గడిపే కొద్దీ..ఎవరైనా నటన నేర్చుకుంటారని రిమీసేన్ చెప్పుకొచ్చింది. "జాన్ కూడా అలాగే చేశాడు. మెల్లమెల్లగా యాక్టింగ్ నేర్చుకున్నాడు.పాపులారిటీ పెరిగిన తర్వాత నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు చేశాడు" అంటూ వెల్లడించింది. దుబాయ్ నగరం గురించి చెబుతూ.. ఈ ఎడారి నగరం అందరినీ సాదరంగా ఆహ్వానిస్తుందనీ, ఇక్కడి జనాభాలో 95 శాతం మంది ప్రవాసులేనని పేర్కొన్నది. తన లుక్ పూర్తిగా మారిపోవడంపై మీడియా అడిగిన ప్రశ్నలకూ సమాధానాలు ఇస్తూ.. తానేమీ ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోలేదనీ, బ్యూటీపై కేర్ తీసుకోక పోవడంతో ముఖం కొంత రంగు మారిందని చెప్పుకొచ్చింది. తన రూపాన్ని మార్చుకోవడానికి తానేమీ నేరాలు చేయలేదంటూ చెప్పుకొచ్చింది. బెంగాల్‌కు చెందిన రిమీసేన్..సినిమా రంగంపై ఆసక్తితో ముంబైకి మకాం మార్చింది.2000లో బెంగాలీ సినిమా 'పరోమితార్ ఏక్ దిన్' చిత్రం ద్వారా హీరోయిన్‌గా కెరీర్ మొదలుపెట్టింది. 2001లో తెలుగులో అవకాశం దక్కించుకున్నది. తర్వాత అందరివాడులో మెగాస్టార్ సరసన ఆడిపాడింది. ఇటు బాలీవుడ్‌లోనూ 'హంగామా' చేసి, అమితాబ్ సినిమాలో అవకాశం కొట్టేసింది. ఆ తర్వాతి చిత్రం 'ధూమ్' భారీహిట్ కొట్టడంతో..కెరీర్‌లో జెట్‌స్పీడ్‌తో దూసుకెళ్లింది. అనేక సినిమా ఆఫర్లు దక్కించుకుంది. కానీ, వాటిలో ఎక్కువగా బాక్సాఫీస్ దగ్గర పరాజయాన్ని చవిచూడటంతో.. రిమీ జోరు తగ్గింది.

ఉపేంద్ర లిమాయే కొత్త అవతారం

యానిమల్ సినిమాతో తెలుగులో మంచి పాపులారిటీ తెచ్చుకున్నాడు మరాఠి యాక్టర్ ఉపేంద్ర లిమాయే. ఆ తర్వాత సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో తన డైలాగ్ డెలివరీతో అదరగొట్టేశాడు. ఇప్పుడు బా బా బ్లాక్‌షీప్ టీంతో వినోదాన్ని పంచేందుకు రెడీ అవుతున్నాడు. క్రైం కామెడీ జోనర్‌లో ఎంటర్‌టైన్ చేసేందుకు వస్తోంది బా బా బ్లాక్‌షీప్ . గుణి మంచికంటి డైరెక్షన్‌లో వస్తున్న ఈ మూవీ టీజర్‌ను శర్వానంద్ లాంచ్ చేశాడు. టీజర్ ప్రారంభంలో అక్షయ్ ఈవెంట్‌లో చెఫ్ లుక్‌లో కనిపించగా.. ఆ తర్వాత విష్ణు ఎంట్రీ ఇస్తాడు. ఈవెనింగ్ సర్‌ప్రైజ్ మామ అని విష్ణుతో చెప్తాడు అక్షయ్. పోలీసులు మన వెంట ఎందుకొస్తున్నారురా.. వాళ్లను కూడా ఇన్వైట్ చేశావా..అని టెన్షన్ పడుతుంటే.. ఉపేంద్ర లిమాయే ఎంట్రీ ఇస్తాడు. జాన్ షెల్లీ హిట్లర్ అనే డాన్ పాత్రలో ఉపేంద్ర లిమాయే క్యారెక్టర్ ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతున్నట్టు టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. మీరు దొబ్బేసిన బాక్స్ అండ్ గన్ ఎక్కడ....నా దగ్గర కొట్టేసిన బాక్స్ ఎవరికి అమ్మేశారని అడిగే డైలాగ్స్ తో సాగే టీజర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. చెప్పుకోవడానికి ఇది మామూలు కథ కాదు. అండపిండ బ్రహ్మాండాలనే అల్లాడించే కథ అంటూ విడుదల చేసిన టీజర్ సినిమాపై ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మూవీలో టిను ఆనంద్, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయ శ్రీ, మాళవి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.ఆరుగురు వ్యక్తులు.. గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే వేట, ముగ్గురి తెలివి తేటలు.. ఒక రోజులో జరిగే ఘటనలు.. ఆరుగురు వ్యక్తుల ప్రయాణంలో వారికి ఎదురైన పరిస్థితులు, ఈ క్రమంలో వచ్చే కామెడీ, క్రైం లాంటి అంశాలు ప్రేక్షకులకు థ్రిల్ కలిగించనున్నట్టు టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రాన్ని దోనెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనెపూడి నిర్మిస్తున్నారు.

'బోర్డర్ 2' భారీ ఓపెనింగ్స్

దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' భారీ అంచనాల నడుమ జనవరి 22న థియేటర్లలో రిలీజైంది. విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోంది. ఈ క్రమంలో ఈ చిత్రం తొలి రోజే భారతీయ బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ. 30 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. దీంతో గతేడాది రిలీజైన 'ధురంధర్' తొలి రోజు కలెక్షన్లు రూ. 28.60 కోట్లను అధిగమించి రికార్డును బ్రేక్ చేసింది. తొలి రోజే భారీ స్థాయిలో కలెక్షన్స్ సంపాదించడంతో ఈ వీకెండ్‌లో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురుస్తుందనే చెప్పవచ్చు.

రౌడీ ఫ్యాన్స్‌కు పూనకాలే

రౌడీ హీరో విజయ్ దేవరకొండ అభిమానులకు రిపబ్లిక్ డే సందర్భంగా మేకర్స్ అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'VD14' (వర్కింగ్ టైటిల్) చిత్రానికి సంబంధించి అధికారిక టైటిల్ మరియు ఫస్ట్ లుక్ లేదా గ్లింప్స్‌ను జనవరి 26న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో విజయ్, రాహుల్ కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సీవాలా' సూపర్ హిట్ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

ఈ చిత్రం 19వ శతాబ్దపు నాటి పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా, బ్రిటిష్ కాలం నాటి తెలియని చరిత్ర ఆధారంగా తెరకెక్కుతోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ సినిమాకు 'రణభేరి' లేదా 'ది గన్' అనే పవర్‌ఫుల్ టైటిల్స్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పనులు శరవేగంగా జరుగుతుండగా, దర్శకుడు రాహుల్ ఇటీవల సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "రౌడీ ఫ్యాన్స్ ఆకలి తీరేలా ఈ సినిమా ఉంటుంది" అని హామీ ఇవ్వడం విశేషం. ఇందులో విజయ్ సరసన రశ్మిక మందన్న నటిస్తుండగా, బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్లు అజయ్‌అతుల్ సంగీతం అందిస్తున్నారు. ఈ రిపబ్లిక్ డే అప్‌డేట్‌తో విజయ్ దేవరకొండ మళ్ళీ సాలిడ్ కంబ్యాక్ ఇవ్వడం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.



అనుపమ 'లాక్‌డౌన్'కు మోక్షం..

మలయాళ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన ఎమోషనల్ థ్రిల్లర్ 'లాక్‌డౌన్' ఎట్టకేలకు విడుదల తేదీని ప్రకటించింది. ఏఆర్ జీవా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం గతేడాదే విడుదల కావాల్సి ఉన్నా, తమిళనాడులో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలు మరియు కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ సినిమా కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. 'ప్రతి నిరీక్షణ వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది' అనే సందేశంతో ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు స్పష్టం చేసింది.ఈ చిత్రంలో అనుపమ 'అనిత' అనే మధ్యతరగతి యువతిగా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనుంది. కరోనా లాక్‌డౌన్ కాలంలో సామాన్యులు ఎదుర్కొన్న చేదు అనుభవాలు, ముఖ్యంగా ఒక యువతి ఒంటరిగా క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొంది అనే యదార్థ గాథ ఆధారంగా ఈ సినిమాను మలిచారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, నాయికా ప్రాధాన్యత ఉన్న ఈ చిత్రం అనుపమ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200